సాక్షి 24|7

పశ్చిమగోదావరి

గురువారం 24-8-2017



ఉచ్చు బిగుస్తోంది

- ఉద్యాన శాఖలో అవినీతి
- సాక్షి కథనాలపై స్పందన
- సీరియస్‌గా తీసుకున్న ఆ శాఖ కమిషనర్
- నాలుగు బృందాలతో తనిఖీలు
- చర్యలకు రంగం సిద్ధం


2లో

- గోదావరి జిల్లాలకు పొంచివున్న ముప్పు
- తెలంగాణలో గోదావరి, దాని ఉప నదులపై 9 ఎత్తిపోతల పథకాలు
- అవి పూర్తయితే సహజ జలాల రాకకు అడ్డుకట్ట
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణమే శాశ్వత పరిష్కారం
- ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన ప్రభుత్వం
- పట్టిసీమ, పురుషోత్తపట్నం పథకాలపై మమకారం

సాగునీటి గండం



ధవళేశ్వరం బ్యారేజి నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీరు



వృథాగా సముద్రంలో కలిసిన గోదావరి జలాలు

సంవత్సరం	టీఎంసీలు
2012	2,426.110
2013	5,343.507
2014	1,949.880
2015	1,243.225
2016	2,827.023

నాడు

కర్ణాటక ప్రభుత్వం ఆలమట్టి డ్యామ్ ఎత్తు పెంచినా అప్పటి చంద్రబాబు సర్కారు పట్టించుకోలేదు. ఫలితంగా నేడు కృష్ణా డెల్టా రైతులు సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మొదటి పంటకు సైతం నీరందక ఇబ్బందులను చవిచూస్తున్నారు.

నేడు

తెలంగాణ సర్కారు గోదావరి, దాని ఉప నదులపై ఏకంగా తొమ్మిది ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపడుతోంది. దీంతో ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే దిగువకు నీళ్లు వచ్చే అవకాశాలు బాగా తగ్గిపోతాయి

పోలవరం/కొవ్వూరు :

ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటికే గోదావరి డెల్టా ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులు రెండో పంటకు సాగునీరు అందక ఇబ్బందులను చవిచూస్తున్నారు. ఏటా రబీ సీజన్‌లో తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. 2009 తర్వాత రెండేళ్లు మినహా

మిగతా 2వ పేజీలో ▶

బతికేదెలా..?



చాగల్లు సుగర్ ఫ్యాక్టరీ మూసివేతతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని, పది నెలలుగా జీతాల్లేక, పిల్లల ఫీజులు కట్టలేక అర్థాకలితో అలమటిస్తున్నామని కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

10లో

ఒక్కొక్కటిగా వెలుగులోకి..

- బయటకొస్తున్న ఎస్సై అవినీతి లీలలు
- డీఎస్పీ వద్దకు క్యూ కడుతున్న బాధితులు

సాక్షిప్రతినిధి, ఏలూరు :

జంగారెడ్డిగూడెం ఎస్సై కేశవరావు అవినీతి లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఎస్సై బాధితులు జంగారెడ్డిగూడెం డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ ఎదుట క్యూ కడుతున్నారు. ఇప్పటి వరకు బాధితులు భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయలేదని సమాచారం. అవినీతి బాగోతం బయటపడటంతో ధైర్యంగా బాధితులు డీఎస్పీ కార్యాలయానికి

మిగతా 2వ పేజీలో ▶



ఎస్సై కేశవరావు

పశ్చిమగోదావరి | గురువారం | ఆగస్టు | 24 | 2017 సాక్షి

ఉచ్చు బిగుస్తోంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు :

ఉచ్చు బిగుస్తోంది... ఉద్యాన శాఖలో అవినీతి గుట్టు వీడింది. కనీసం పంట వేయకుండానే కోట్ల రూపాయల సబ్సిడీలను దిగమింగిన వైనాన్ని సాక్షి బయటపెట్టిన సంగతి తెలిసిందే. విచారణలో కోటి 30 లక్షల రూపాయల మేర అవినీతి జరిగినట్లు జిల్లా అధికారులు నిగ్గతేల్చారు. దీనిపై ఉద్యానవన శాఖ కమిషనర్ స్పందించి నాలుగు బృందాలను విచారణ కోసం పంపించారు. అందులో రెండు బృందాలు ఇప్పటికే నివేదిక ఇవ్వగా, మిగిలిన బృందాల నివేదిక రాగానే అవినీతికి పాల్పడిన అధికారులపై వేటు పడనున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.... కామవరపుకోట మండలంలో గత మూడేళ్లుగా ఉద్యాన పంటలు వేస్తున్నట్లుగా రికార్డుల్లో చూపించి కోట్లాది రూపాయల సబ్సిడీలను నొక్కేశారు. వారి మధ్య వాటాల్లో వచ్చిన తేడాల కారణంగా తెలుగుదేశం నాయకులు పోట్లాడు కోవడంతో ఈ విషయం వెలుగుచూసింది. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను చూపించి అక్కడ ఉద్యాన పంటలు వేసినట్లుగా సబ్సిడీలను డ్రా చేశారు. గడచిన మూడేళ్ల కాలంలో మూడున్నర కోట్ల రూపాయల వరకూ సబ్సిడీలు డ్రా చేయగా అందులో రెండున్నర నుంచి మూడు కోట్ల రూపాయలు ఎటువంటి పంటలు వేయకుండా నిధులు మెక్కేశారు. కామవరపుకోట మండలం కామవరపుకోట, మంకెనపల్లి, తడికలపూడి, కొండగూడెం తదితర గ్రామాల్లో ఈ వ్యవహారం నడిపారు. ఒకే సర్వే నెంబర్లతో రెండుచోట్ల సబ్సిడీ తీసుకోగా, అసలు రెవెన్యూ రికార్డుల్లో లేని సర్వే నెంబర్లపై కూడా సబ్సిడీ తీసుకున్నారు. తమకు ఉన్న సర్వే నెంబర్లతో పాటు వేరే వారి పేర్లతో ఉన్న సర్వే నెంబర్లపై కూడా సబ్సిడీ తీసేసుకున్నారు. అయితే ఎక్కడా అసలు ఈ పంటలు వేయకపోవడం గమనార్హం. వారు సబ్సిడీలు తీసుకున్న చోట్ల దశాబ్దాల క్రితం నుంచి ఉన్న కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలు ఉన్నాయి. ఇంత అడ్డగోలుగా సాగించిన వ్యవహారంలో ఎక్కువ మంది తెలుగుదేశం నాయకులే ఉన్నారు. ఈ సబ్సిడీలు డ్రా చేసిన సర్వే నెంబర్లలో కొన్ని రెవెన్యూ రికార్డుల్లో నాట్‌ఫౌండ్ అని వస్తుంటే, కొన్ని అసలు సర్వే నెంబర్లు లేవు. ఈ వ్యవహారాన్ని సాక్షి సాక్ష్యాలతో సహా వెలుగులోకి తీసుకురావడంతో జిల్లా కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కోటీ 30 లక్షల రూపాయల వరకూ దుర్వినియోగం జరిగిందని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. జిల్లా నేతలతో ముఖ్యమంత్రి జరిపిన సమావేశంలో కూడా ఈ అవినీతిపై ఆరా తీసారు. దీంతో ఈ అవినీతిపై నివేదికను ఉద్యానవన శాఖ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ పంపించారు. ఆయన స్పందించి నాలుగు బృందాలను పంపించి విచారణ జరిపించారు. వీరి విచారణలోనూ భారీగా అవినీతి జరిగిందని, ఇందులో తెలుగుదేశం నాయకుల పాత్ర ఉందని, అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఈ అవినీతికి పాల్పడినట్లు తేలింది. ఇప్పటికే రెండు బృందాలు తమ నివేదికను కమిషనర్‌కు సమర్పించగా, మరో రెండు బృందాలు ఈ వారంలో నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఈ నివేదికలు అందగానే అవినీతికి పాల్పడిన అధికారులపై వేటు వేయడంతో పాటు బాధ్యులైన వారి నుంచి స్వాహా చేసిన సబ్సిడీలు రాబట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సాగునీటి గండం

▶ మొదటి పేజీ తరువాయి

రెండో పంటకి ఏటా వంతుల వారీ విధానంలో సాగునీరు అందిస్తున్నారు. ఆరేళ్ల నుంచి రెండో పంటకు సీలేరు జలాలపైనే ఆధారపడి నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తొమ్మిది పథకాలు పూర్తయితే భవిష్యత్‌లో మరింత విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సిన ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా సరాసరి 2,500 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకునే మార్గం లేకపోవడంతో వేలాది టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది.

ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో 7.20 లక్షల ఎకరాలకు నీరందించే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చుతోంది. 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం గల పోలవరం ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి సమస్యకు తెరపడే అవకాశం ఉంది. అంతే కాకుండా 960 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తూ కేవలం తాత్కాలిక లబ్ధిని చేకూర్చే పట్టిసీమ, పురుషోత్తపట్నం పథకాల పేరుతో రూ.3,200 కోట్లు పైగా ప్రజాధనం వృథా చేస్తోంది. కేవలం కమీషన్‌లు దండుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ రెండు పథకాల నిర్మాణం చేపట్టిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తొమ్మిది ఎత్తిపోతలు పూర్తయితే గోదావరి ఎడారే....?

నది పరివాహకంలో నీటి లభ్యత పడిపోవడంతో ఏటా రబీ సీజన్‌లో ఉభయ గోదావరి జిల్లా రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో తెలంగాణ ప్రభుత్వం గోదావరి ఉపనదులైన వార్ధా, పెన్‌గంగ, ప్రాణహిత కలిసే ప్రదేశాల్లో రూ.6,286 కోట్ల వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, రూ.685 కోట్లతో ప్రాణహిత ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టింది. దిగువన భద్రాచలం సమీపంలో భక్తరామదాసు, సీతారామ పథకం రూ.1,151.59 కోట్లతో, లోయర్ పెన్‌గంగ రూ.124.90 కోట్లతో, లెండి రూ.19.02 కోట్లతో, దేవాదుల రూ.695 కోట్లతో, కుంతనాపల్లికి రూ.200 కోట్లతో, బీమా ఎత్తిపోతల పథకాన్ని రూ.125 కోట్లతో చేపట్టింది. గత ఏడాది బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. ఎగువన ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే వరదల అనంతరం అక్టోబర్, నవంబర్‌లో గోదావరికి వచ్చే సహజ జలాలకు అడ్డుకట్ట పడినట్లే అవుతుంది.



మందకొడిగా సాగుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు

పొంచి ఉన్న ప్రమాదం :

గోదావరికి ఎగువ నుంచి అక్టోబర్ నెలలో రోజుకి సగటున 40 వేల క్యూసెక్కులు, నవంబర్‌లో 20 వేల క్యూసెక్కుల చొప్పున మాత్రమే ఇన్‌ఫ్లో వస్తుంది. తెలంగాణలో ఈ ప్రాజెక్టులు పూర్తయితే అక్టోబర్, నవంబర్ నెలల్లో ఇన్‌ఫ్లో పడిపోవడం ఖాయం. ఆ సమయంలో గోదావరి జిల్లాల్లో ఖరీఫ్ పంట కీలక దశలో ఉంటుంది. ఏటా రబీకి 80 టీఎంసీల నీరు అవసరం. దీనిలో ఎగువ నుంచి సహజ జలాల రూపంలో 40 టీఎంసీలు వస్తుంది. సీలేరు జలాలతో పాటు నీటి పొదుపు చర్యల ద్వారా ఏటా గోదావరి జిల్లాల్లో రబీ సాగు గట్టెక్కుతుంది. ఎగువన ప్రాజెక్టులు పూర్తయితే గోదావరి డెల్టా ఆయకట్టులో 10.13 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఉభయ గోదావరితో పాటు కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో కృష్ణా ఆయకట్టు గట్టెక్కాలంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణమే శాశ్వత పరిష్కారం.

ప్రచారం ఎక్కువ–పనులు తక్కువ

పోలవరం రిజర్వాయర్ ద్వారా 194.60 టీఎంసీల గోదావరి జలాలను నిల్వ చేసుకోవటంతో పాటు 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మరో 79 టీఎంసీల నీటిని లైవ్ స్టోరేజ్‌గా వినియోగించుకునే అవకాశం ఉంది. 80 టీఎంసీల నీటిని కృష్ణా జిల్లాకు తరలిస్తే, కృష్ణా నదిలోని 30 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ వద్ద నుంచి రాయలసీమ అవసరాలకు వినియోగించవచ్చు. 540 గ్రామాలకు తాగునీరుతోపాటు, విశాఖ పరిశ్రమలకు, తాగునీటి అవసరాలకు నీరు అందుతుంది. 2018 నాటికి నీటిని విడుదల చేయాలంటే కాపర్ డామ్ నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ఇంతవరకు కాపర్‌డామ్‌కు సంబంధించి డిజైన్లు ఖరారు కాలేదు.

ఐదు రెట్లు పెరిగిన అంచనా వ్యయం

2005–06లో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,151.45 కోట్లుగా నిర్ధారించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ ప్రాజెక్టును 2014 ఏప్రిల్ 1న జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ఈప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. కేంద్రం ఇచ్చే నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం యుటిలైజేషన్ బిల్లులు సమర్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన బిల్లులకు, ఖర్చు చేసిన నిధులకు పొంతన లేదనే అనుమానాలు ఉన్నాయి. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.48 వేల కోట్లు పెరిగినట్టు ప్రకటించారు.

ఒక్కొక్కటిగా వెలుగులోకి..

▶ మొదటి పేజీ తరువాయి

క్యా కడుతున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని, తమ వద్ద ఎంతెంత సొమ్ము తీసుకుంది, సొమ్ము తీసుకుని తమను ఏ విధంగా మోసం చేశారో తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. బుధవారం పెద్ద సంఖ్యలో డీఎస్పీ కార్యాలయానికి బాధితులు వచ్చారు. ఇప్పటికే డీఎస్పీ మురళీకృష్ణ ఎస్సై వ్యవహార శైలి, అవినీతిపై విచారణ ప్రారంభించి, చాలా వరకు సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. స్థానిక మార్కెట్ సమీపంలో ఒక కాంప్లెక్స్‌లో షాపును ఖాళీ చేయించేందుకు భారీ మొత్తం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఏకంగా డ్రైవర్‌నే మార్చివేసి రూ.40 వేలు వసూలు చేయగా, ఆటో ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ను మార్చి రూ.20 వేలు తీసుకున్నట్లు సమాచారం. ఇక తాడువాయి గ్రామంలో ఒక భూవివాదానానికి సంబంధించి కూడా భారీగా వసూలు చేసినట్లు తెలిసింది. ఒక వ్యభిచార గృహంపై దాడిచేసి బెదిరించి నామమాత్రంగా కేసు నమోదు చేసి ఆ తరువాత నెలవారీ మామూళ్లు ఏర్పాటు చేసుకున్నట్లు తాజాగా బయటకు వచ్చింది. ఇదిలా ఉంటే ఇటీవల జంగారెడ్డిగూడెంలో పశువుల అక్రమ రవాణా వాహనాన్ని సీజ్ చేశారు. దీనిలో కొన్ని పశువులను గోశాలకు తరలించి మరికొన్ని పశువులను అమ్మేసి వాటిని అనారోగ్యంతో ఉన్నాయనే నెపంతో మార్కెట్‌యార్డులో ఉంచినట్లు రికార్డులో చూపించారు. అయితే ఈ రికార్డులను తారుమారు చేసేందుకు మంగళవారం రాత్రి విశ్వప్రయత్నం చేసినట్లు తెలిసింది. అలాగే పేకాట కేసుల్లో దాడిచేయడం, మీపై కేసులు లేకుండా ఉండాలంటే మీ దగ్గర ఉన్న సొమ్మంతా ఇచ్చేయండి అని బెదిరించి సొమ్మును కాజేసిన ఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో ఒక మహిళ హత్యకు గురికాగా, నిందితులను అరెస్టు చేయడం మానివేసి బాధిత కుటుంబ సభ్యులనే బెదిరించి సొమ్ములు గుంజినట్లు తెలిసింది. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి సంబంధించి వచ్చిన ఫిర్యాదులో నిందితుల నుంచే కాకుండా బాధితులపై కేసు నమోదు చేసి ఇరు వర్గాల నుంచి లక్షలాది రూపాయలు దండుకున్న వైనం కూడా వెలుగులోకి వచ్చింది. స్టేషన్‌కు ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వస్తే వారిపైనే కేసు కడతానని బెదిరించడం, కేసు లేకుండా ఉండాలంటే సొమ్ములు ఇవ్వాలని వారి వద్దే వసూలు చేయడం లాంటి ఘటనలు డీఎస్పీ వద్దకు వచ్చినట్లు సమాచారం. తనకు నచ్చని సిబ్బందిని కూడా ఈ అధికారి వేధించినట్లు సమాచారం. వీరికి వేరే డ్యూటీలు వేసి బయటకు పంపించి నానా అవస్థలకు గురిచేసే వారని సిబ్బంది చెబుతున్నారు. స్టేషన్‌లో ఏం జరుగుతుందో తెలియకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకునేవారని, అలాగే తనకు ఇష్టమైన సిబ్బందికి అసలు డ్యూటీలే ఉండేవి కాదని సిబ్బంది చెబుతున్నారు. తన వ్యవహారాలను చక్కబెట్టడం కోసం ఒక ప్రైవేట్ డ్రైవర్‌నే కాకుండా, తాజాగా ప్రభుత్వం నియమించిన కమ్యూనిటీ పోలీసింగ్ ఆఫీసర్స్ (సీపీవో)లను కూడా ఉపయోగించుకున్నట్లు సమాచారం. వీటన్నింటిపై జిల్లా ఎస్పీ పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

మార్కెట్‌లోకి హ్యుందాయ్ కొత్త వెర్షన్ వెర్నా

భీమవరం : హ్యుందాయ్ ది నెక్స్ జెన్ వెర్నా (అయిదోతరం) వెర్షన్‌ని బుధవారం భీమవరంలోని కుశలవ హ్యుందాయ్ షోరూంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ (సేల్స్ మరియు మార్కెటింగ్) బి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ది నెక్స్ జెన్ వెర్నా 1.6లీటర్ పెట్రోల్ మరియు డీజిల్ ఇంజన్‌తో ఆకర్షణీయమైన ధరలతో రూ.7.99 లక్షల నుండి 12.61 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్య ఉందని చెప్పారు. ఆకర్షణీయమైన డిజైన్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, సన్‌రూఫ్, 7.0 ఎయుఎన్, క్రూస్ కంట్రోల్స్, వెంటిలేటెడ్ సీట్లు, డైమండ్ కట్ అలాయ్ వీల్స్ వంటి ప్రత్యేకతలతో మంచి ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. మూడు సంవత్సరాల అన్‌లిమిటెడ్ వారంటీ, సరికొత్త కలర్స్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వెర్నా కొత్త వెర్షన్ ప్రారంభ ధరలు మొదటి 20,000/– వినియోగదారులకు మాత్రమే వర్తిస్తాయి. అనంతరం కొత్త ధరలు నిర్ణయిస్తామని హ్యుందాయ్ కంపెనీ తెలిపింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగధారులను కోరారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యేశ్వర్, ఎస్‌బీఐ ఏజీఎం తులసీదాస్, సేల్స్ కన్సల్టెంట్స్ పాల్గొన్నారు.

27 నుంచి సౌత్‌జోన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

భీమవరం : స్థానిక కాస్మో పాలిటన్ క్లబ్‌లో ఈనెల 27 నుంచి నాలుగు రోజులుపాటు గోకరాజు రంగరాజు మెమోరియల్ 73వ సౌత్‌జోన్ ఇంటర్ రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు గోకరాజు రామరాజు (రామం) చెప్పారు. బుధవారం క్లబ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. సుమారు రూ.12 లక్షలతో నిర్వహించే ఈ టోర్నమెంట్ తొలి రెండు రోజులు టీమ్ ఇవెంట్స్, తరువాత రెండు రోజులు ఇండివిడ్యూల్ ఇవెంట్స్ నిర్వహిస్తామన్నారు. క్లబ్ కార్యదర్శి టి.కృష్ణబాబు, టోర్నమెంట్ సెక్రటరీలు ఆర్.సాయిరామరాజు, పీఎస్ సూరజ్, వీవీ సోమరాజు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లే లక్ష్యం.. చోరీలే మార్గం

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 26 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఏలూరు (సెంట్రల్): నగరంలోని అపార్టుమెంట్లే లక్ష్యంగా చోరీలకు తెగబడుతున్న ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి నుంచి 26 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. నగరంలోని టూటౌన్ పరిధిలోని తంగెళ్లమూడి, యాదవ్‌నగర్, బాలయోగి వంతెన, గన్‌బజార్, సెయింట్ థెరిస్సా స్కూల్ ప్రాంతాల్లోని ఆపార్ట్‌మెంట్లలో చోరీలు జరిగినట్టు పోలీసులకు ఐదు ఫిర్యాదులు అందాయి. పోలీసులు పాత నేరస్తులపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా పాముల దిబ్బకు చెందిన దాసరి పేతురు, హనుమాన్ జంక్షన్‌లో శేరి నరసన్నపాలెంకు చెందిన వల్లూరి సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలోని పలుచోట్ల చోరీలకు పాల్పడింది వీరే అని విచారణలో వెల్లడైంది. వారి నుంచి 26 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో చాకచాక్యంగా వ్యవహరించడంతో పాటు వారి నుంచి రూ.5 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబర్చిన టూటౌన్ సీఐ జి.మధుబాబు, సిబ్బందికి ప్రోత్సాహం ఇవ్వాలని జిల్లా ఎస్పీని కోరనున్నట్టు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ మధుబాబు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

- గుండెనొప్పి తాళలేక కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- రక్షించబోయిన అత్తకు తీవ్రగాయాలు


కాలిన గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పెద్దింట్లమ్మ

పాలకొల్లు అర్బన్: గుండెనొప్పి తాళలేక ఒంటిపై కిరోసిన్ పోసుకుని వివాహిత మృతిచెందిన సంఘటన పాలకొల్లు మండలం భగ్గేశ్వరం పంచాయతీ పరిధిలోని సత్య నారాయణపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. భగ్గేశ్వరం గ్రామానికి చెందిన అందే అగ్ని వీరభద్రరావు, మల్లమాంబ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అరుణాదేవిని మేనమామ వాసా కోటి నాగేశ్వరరావుకిచ్చి 2010లో వివాహం చేశారు. కోటి నాగేశ్వరరావు పాలకొల్లులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నారు. అరుణాదేవికి ఇద్దరు కుమారులు. బుధవారం ఉదయం పెద్ద కుమారుడు శ్రీశాంత్ పాలకొల్లులో స్కూల్‌కు వెళ్లాడు. చిన్నకుమారుడు భీష్మను అంగన్‌వాడీ కేంద్రానికి పంపారు. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోగా అరుణాదేవి కడుపునొప్పి తాళలేక ఒంటిపై కిరోసిన్ పోసుకుని అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెను రక్షించబోయిన అత్త పెద్దింట్లమ్మ తీవ్రగాయాలపాలైంది. కుమార్తె మృతదేహం వద్ద తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పెద్దింట్లమ్మ పరిస్థితి విషమం

తీవ్రగాయాలపాలైన పెద్దింట్లమ్మ పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు. పాలకొల్లు పట్టణ సీఐ బి.కృష్ణకుమార్, తహసీల్దార్ దాసి రాజు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బి.కృష్ణకుమార్ చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: విధినిర్వహణలో ఉన్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పంగిడిగూడెం పంచాయతీలో గంటా రామకృష్ణ (35) విద్యుత్ విభాగంలో రోజువారీ వేతనంపై పనిచేస్తున్నాడు. ఇటీవల గ్రామాల్లో వీధిలైట్లు, ఎల్ఈడీ బల్బులు మార్చే క్రమంలో బుధవారం ఎల్ఈడీ బల్బులు అమర్చుతున్నారు. అయితే ఈ సమయంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి రామకృష్ణ విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరతున్నారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.శ్రీనివాసయాదవ్ చెప్పారు.

రోడ్డుపై ప్రసవ వేదన

- దిక్కులేని స్థితిలో ప్రసవం
- బాసటగా నిలిచిన జిమ్ యువకులు



రోడ్డుపై ప్రసవించిన మహిళ, శిశువుకు సపర్యలు చేస్తున్న యువకులు

తాడేపల్లిగూడెం రూరల్ : ఏ మృగాడి అకృత్యమో.. ఆమె పాలిట శాపంగా మారింది. నవమాసాలు నిండిన ఆమె దిక్కులేని స్థితిలో ప్రసవ వేదనతో అల్లాడిపోయింది. ఎట్టకేలకు మగశిశువుకు జన్మనిచ్చింది. ఈ సంఘటన బుధవారం ఉదయం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లా వెనుక బేతేలు చర్చి ఎదురుగా ఉన్న రోడ్డులో చోటుచేసుకుంది. ప్రసవ వేదనతో కొట్టుమిట్టాడుతున్న ఆమె (పేరు తెలియని మహిళ)ను ఉదయం జిమ్‌కు వెళ్తున్న ఒక అధ్యాపకుడు చూసి జిమ్‌లోని యువకులకు చెప్పాడు. యువకులు కొలుకుల మోహన్, గండి వెంకటేష్, వెంకటరత్నం ఆర్ఎంపీ డాక్టర్ రాజు సహకారంతో ఆమెకు సపర్యలు చేశారు. ఆమె అక్కడే మగశిశువుకు జన్మనిచ్చింది. ఆమెను, శిశువును 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి


ఘటనా స్థలిలో షేక్ బాబాజాన్, బొక్కా దుర్గాప్రసాద్ మృతదేహాలు

పెనుగొండ: పెనుగొండ–నరసాపురం రహదారిపై కెనాల్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. పెనుగొండలో రామచంద్రరావుపేటకు చెందిన షేక్ బాబాజాన్ (44), చెరుకువాడకు చెందిన బొక్కా దుర్గాప్రసాద్ (17) ఉదయం వెల్డింగ్ పనులకు బైక్‌పై వెళుతున్నారు. గ్రామంలోని లింగాల వీధిలో నుంచి కెనాల్ రోడ్డు పైకి వస్తుండగా మార్టేరు వైపు వెళుతున్న ఇటుకల ట్రాక్టర్, వీరి బైక్ ఒకదానినొకటి ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై వెళుతున్న బాబాజాన్, దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పెనుగొండ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు బాబాజాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. బొక్కా దుర్గాప్రసాద్ యువకుడు. పేద కుటుంబాలకు చెందిన వీరు రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. అకాల మరణంతో వీరి కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

‘గుడ్లు’ తేలేసిన విద్యార్థులు

- కుళ్లిన కోడిగుడ్లు తిని 12 మందికి అస్వస్థత
- కుక్కునూరు మండలం చీరవల్లిలో సంఘటన


కుక్కునూరు పీహెచ్‌సీలో విద్యార్థికి చికిత్స చేస్తున్న వైద్యుడు


అస్వస్థతకు గురైన విద్యార్థులు

కుక్కునూరు: మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం అందించే గుడ్లలో నాణ్యతలేమి మరోసారి బయటపడింది. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లు కుళ్లిపోయిన విషయం మరువక ముందే ప్రభుత్వం పాఠశాలలో గుడ్లు తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన కుక్కునూరు మండలం చీరవల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. చీరవల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు ఉడకపెట్టిన కోడిగుడ్లు అందించారు. వీటిని తిన్న 12 మంది ఆరో తరగతి విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకున్నారు. దీంతో అప్రమత్తమైన ఉపాధ్యాయులు విద్యార్థులను హుటాహుటిన కుక్కునూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థుల అస్వస్థతకు కుళ్లిన గుడ్లే కారణమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇతర తరగతుల విద్యార్థులకు ఇచ్చిన గుడ్లలో కూడా చాలా వరకు కుళ్లిపోయి ఉన్నాయని, అయితే దీనిని గమనించి పలువురు విద్యార్థులు పడేసినట్టు చెబుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యం

మేషం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. సన్నిహితుల నుంచి సహాయం. వాహనయోగం. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.

వృషభం: రుణయత్నాలు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో స్వల్ప వివాదాలు. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు. ఆరోగ్యభంగం.



మిథునం: దూర ప్రయాణాలు. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగులకు గందరగోళం. దైవదర్శనాలు

కర్కాటకం: పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. ఆర్థిక ప్రగతి. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా పూర్తి. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు పదోన్నతులు.

సింహం: ప్రయాణాలు. రుణయత్నాలు. పనులలో జాప్యం. బంధువులు, మిత్రులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

కన్య: పనులు సకాలంలో పూర్తి. సంఘంలో గౌరవం. ఇంటర్వ్యూలు అందుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు. వ్యాపారాలు లాభిస్తాయి.

తుల: ప్రయాణాలు వాయిదా. శ్రమాధిక్యం. పనులు మందగిస్తాయి. బంధువుల నుంచి ఒత్తిడులు. వ్యాపారాలు సామాన్యమే. ఉద్యోగులకు ఆకస్మిక మార్పులు.

వృశ్చికం: ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు. వ్యాపారాలు పుంజుకుంటాయి. బంధువుల కలయిక. విందు వినోదాలు. ఆకస్మిక ధన, వస్తులాభాలు.

ధనుస్సు: పాతమిత్రుల కలయిక. ఇంటర్వ్యూలు అందుతాయి. ఆసక్తికరమైన సమాచారం. ఆలయ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

మకరం: కుటుంబంలో చికాకులు. బంధువుల నుంచి ఒత్తిడులు. అనుకోని ప్రయాణాలు. ఖర్చులు. ఉద్యోగ, వ్యాపారాలలో మార్పులు ఉండవచ్చు.

కుంభం: వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. దూరప్రయాణాలు. అనుకోని ధనవ్యయం. ఉద్యోగులకు పనిభారం. వ్యాపారాలు మందగిస్తాయి. సోదరుల కలయిక.

మీనం: పనులలో విజయం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

– సింహంభట్ల సుబ్బారావు

స్థిర ఆదాయానికి భరోసా..
'ప్రధానమంత్రి వయ వందన'

- 60 ఏళ్లు దాటినవారికి పెట్టుబడికి ఇదో ఉత్తమ మార్గం
- గరిష్టంగా రూ.7.5 లక్షల వరకూ పెట్టుబడికి అవకాశం
- మీ నగదు పెట్టుబడికి రక్షణ.. రాబడికి హామీ



నిడమర్రు:

జీవిత చరమాంకంలో సంతోషంగా గడిపేయాలని అందరూ కోరుకుంటారు. అప్పటివరకూ కుటుంబ బాధ్యతలు, పిల్లలకోసం నిరంతరం శ్రమపడినవారు కాస్త విశ్రాంతి కోరుకుంటారు. సంపాదించే రోజుల్లో రూపాయి రూపాయి కూడబెట్టి, దాన్ని విశ్రాంత జీవనంలో నిరంతరం రాబడులను ఇచ్చే పథకాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా అవసరాలను తీర్చుకోవచ్చు. ఇలాంటి వారికోసం 'ప్రధాన మంత్రి వయ వందన పథకం' పేరుతో ఓ పెన్షన్ పథకాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ఏడాది మే నెలలో ప్రారంభించారు. ఆ పథకం వివరాలు తెలుసుకుందాం..

ప్రతి నెలా ఆదాయం కోరుకునే వారికి

ప్రతి నెల స్థిరమైన ఆదాయం కోరుకునే పెద్దల కోసం ఈ ప్రధాన మంత్రి వయ వందన పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఏకమొత్తంలో పెట్టుబడి పెడితే, దానిపై 8 శాతం వడ్డీ రేటుతో ప్రతి నెల ఆదాయం వస్తుంటుంది. దీని నిర్వహణ బాధ్యతల్ని ప్రభుత్వరంగ సంస్థ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) చూస్తోంది. ఇన్వెస్ట్ చేసిన తదుపరి నెల నుంచే పెన్షన్ అందుతుంది. 60 ఏళ్లు దాటినవారే ఇందులో చేరేందుకు అర్హులు. కాల వ్యవధి పదేళ్లు. దీనికి గరిష్ట వయోపరిమితి లేదు. కాల పరిమితి తీరిన తర్వాత పెట్టుబడి పెట్టిన మొత్తాన్ని వెనక్కి ఇచ్చేస్తారు. ఒకవేళ పాలసీదారుడు కాలవ్యవధి తీరకముందే కాలం చేస్తే, పెట్టుబడి మొత్తాన్ని నామినీకి చెల్లిస్తారు. వడ్డీ రేటు తగ్గిపోతున్న పరిస్థితుల్లో పదేళ్ల కాలానికి స్థిరమైన వడ్డీ రేటు ఈ పథకం ద్వారా లభిస్తుంది.

పెట్టుబడి ఇలా..

- ఈ పథకంలో రూ.65 వేల నుంచి రూ.7.5 లక్షల వరకూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రూ.5 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఏడాదికోసారి పెన్షన్ కావాలనుకుంటే ప్రతీ వెయ్యి రూపాయలకు రూ.83 చొప్పున రూ.5 లక్షలకు రూ.41,500 చెల్లిస్తారు.
- నెలవారీ పెన్షన్ తీసుకోవాలంటే రూ.1.5 లక్షలు కనీస పెట్టుబడికి ప్రతీ నెల రూ. వెయ్యి పెన్షన్ వస్తుంది. రూ.3 లక్షల ఇన్వెస్ట్‌మెంట్‌పై రూ.2 వేలు. ఇలా ప్రతీ 1.5 లక్షలకు రూ.వెయ్యి అదనంగా అందుకోవచ్చు.
- మూడు నెలలకోసారి పెన్షన్ ఆశించేవారికి ప్రతీ వెయ్యి రూపాయలపై రూ.83.50, ఆరు నెలలకు అయితే రూ.81.30 వస్తాయి.

రుణ సదుపాయం ఉంది

ఈ పాలసీలో ఇన్వెస్ట్ చేసిన వారికి ఉన్న మరో సదుపాయం ఏమిటంటే అవసరమైన సందర్భాల్లో రుణం తీసుకోవచ్చు. అయితే పెట్టుబడి పెట్టిన మూడేళ్ల తర్వాతే రుణ సదుపాయం వర్తిస్తుంది. పెట్టిన పెట్టుబడిలో 75 శాతం వరకూ రుణం మంజూరు చేస్తారు. వడ్డీ రేటు 10 శాతం ఉంటుంది. రుణ వాయిదాలను పెన్షన్ వాయిదాల నుంచి మినహాయించి, మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తారు.

పథకం గురించి మరిన్ని వివరాలు

- ఈ పథకం మే 2018 వరకూ మాత్రమే అందుబాటులో ఉంటుంది.
- పాలసీ గడువు పదేళ్ల పాటు.. పథకం కొనుగోలు సమయంలో పెన్షనర్ ఎంచుకున్న ప్రకారం నెలవారీ, త్రైమాసికంగా, అర్ధ వార్షికంగా, వార్షికంగా చొప్పున ఆయా కాల వ్యవధికి చివర పెన్షన్ చెల్లిస్తారు.
- ఈ పథకంలో పెట్టుబడికి కనిష్ఠ, గరిష్ఠ మొత్తాల పరిమితి ఉంది. ఎంపిక చేసుకున్న పెన్షన్ గడువు అనుసరించి ఈ పరిమితులు వర్తిస్తాయి.
- పెన్షన్ పొందుతున్న వ్యక్తి/జీవిత భాగస్వామికి తీవ్ర వ్యాధులు, టెర్మినల్ ఇల్‌నెస్ సంభవిస్తే, ముందస్తుగా ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. ఇటువంటి ముందస్తు ఉపసంహరణల్లో 98 శాతం కొనుగోలు విలువను రిఫండ్ చేస్తారు.
- పదేళ్ల పాలసీ గడువులో ఏ సమయంలో అయినా పెన్షన్ పొందే వ్యక్తి మరణిస్తే, కుటుంబ సభ్యులకు కొనుగోలు విలువ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.
- ఈ పథకం నిర్వహించనున్న ఎల్ఐసీకి అదనపు ఖర్చులను భరించాల్సి వస్తే, ఆ మొత్తాన్ని కేంద్రం రీయింబర్స్ చేస్తుంది.

ఈ పథకం పాలసీ ఎలా తీసుకోవాలి..?

భారతీయ జీవిత బీమా(ఎల్ఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రభుత్వ పథకంలో ఆన్‌లైన్‌లోనే కాకుండా ఏజెంట్ ద్వారా కూడా చేరవచ్చు. ఆన్‌లైన్ పాలసీ జారీ అయ్యాక పాలసీ నిబంధనలు నచ్చకపోతే 30 రోజుల్లో పాలసీని రద్దు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో పాలసీ తీసుకుంటే రద్దు చేసుకోవడానికి గడువు పాలసీ అందిన తేదీ నుంచి 15 రోజుల లోపు.

ఏలూరు వాతావరణం

గరిష్టం : 34.8 | కనిష్టం : 26.3

నేడు : పిల్ల గాలులు వీస్తాయి. ఓ మోస్తరు వేడి ఉక్కపోత. ఉదయం, సాయంత్రం, రాత్రి వాతావరణం ఆహ్లాదం. ఆకాశం మేఘావృతం. గరిష్టం 32 డి.సె. కనిష్టం 25 డి.సె.

రేపు : ఓ మోస్తరు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం. పగలు వేడి, ఉక్కపోత. ఉదయం కూడా ఓ మోస్తరు వేడి వాతావరణం. గరిష్టం 31 డి.సె. కనిష్టం 25 డి.సె.

శనివారం : కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది. పిల్ల గాలులు వీయవచ్చు. పగలు వేడి, ఉక్కపోత. ఆకాశం మేఘావృతం. గరిష్టం 31 డి.సె. కనిష్టం 26 డి.సె.

తిరుమల సమాచారం



తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – 3 ఖాళీ ఉన్నాయి.
రూ.50 గదులు – 7 ఖాళీ ఉన్నాయి.
రూ.100 గదులు – 15 ఖాళీ ఉన్నాయి.
రూ.500 గదులు – 5 ఖాళీ ఉన్నాయి.

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి.
వసంతోత్సవం – 150 ఖాళీ ఉన్నాయి.
ఆర్జిత బ్రహ్మోత్సవం – 200 ఖాళీ ఉన్నాయి.

గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ

రైల్వే సమాచారం

భీమవరం జంక్షన్ నుంచి విజయవాడకు

57218	ఫ్యాసింజర్	మాచర్ల–భీమవరం	డైలీ	14.40	----
77204	ప్యాసింజర్	గుడివాడ–నరసాపురం	డైలీ	17.50	17.55
77232	ప్యాసింజర్	భీమవరం – గుడివాడ	డైలీ	----	05.25
57282	ఫ్యాసింజర్	నరసాపురం – గుంటూరు	డైలీ	07.05	07.10
77203	ప్యాసింజర్	నరసాపురం – గుడివాడ	డైలీ	08.50	08.55
57298	ప్యాసింజర్	నరసాపురం – గుంటూరు	డైలీ	13.40	13.45
57280	ఫ్యాసింజర్	భీమవరం – గుడివాడ	డైలీ	----	15.40
77205	ప్యాసింజర్	నరసాపురం – భీమవరం	డైలీ	16.50	16.55
17404	ఎక్స్‌ప్రెస్	నరసాపురం – తిరుపతి	డైలీ	18.15	18.20
17255	ఎక్స్‌ప్రెస్	నరసాపురం – హైదరాబాద్	డైలీ	19.45	19.50
77206	ప్యాసింజర్	భీమవరం – విజయవాడ	డైలీ	----	21.15

భీమవరం జంక్షన్ నుంచి నిడదవోలు వైపునకు

57264	ప్యాసింజర్	నరసాపురం – విశాఖపట్న	డైలీ	00.10	00.40
57262	ప్యాసింజర్	నిడదవోలు – భీమవరం	డైలీ	08.55	----
77238	ప్యాసింజర్	రాజమండ్రి– భీమవరం	డైలీ	14.35	----
77240	ప్యాసింజర్	నిడదవోలు – భీమవరం	డైలీ	19.50	----
57279	ప్యాసింజర్	గుడివాడ –నరసాపురం	డైలీ	20.45	20.50
57281	ప్యాసింజర్	గుంటూరు – నరసాపురం	డైలీ	21.32	21.35
77241	ప్యాసింజర్	నిడదవోలు – భీమవరం	డైలీ	23.15	----
57229	ప్యాసింజర్	మచిలీపట్నం-నరసాపురం-విశాఖపట్నం	డైలీ	00.15	00.35
57263	ప్యాసింజర్	నరసాపురం – నిడదవోలు	డైలీ	05.10	05.20
77237	ఫ్యాసింజర్	భీమవరం – రాజమండ్రి	డైలీ	----	07.30
17241	ఎక్స్‌ప్రెస్	నరసాపురం – విశాఖపట్నం	డైలీ	10.55	11.00
57259	ప్యాసింజర్	భీమవరం – రాజమండ్రి	డైలీ	----	14.45
77239	ప్యాసింజర్	భీమవరం– నిడదవోలు	డైలీ	----	15.50
77243	ప్యాసింజర్	భీమవరం టౌన్–నిడదవోలు	డైలీ	17.25	17.55
77241	ప్యాసింజర్	నరసాపురం – రాజమండ్రి	డైలీ	20.45	20.50

భీమవరం జంక్షన్ నుంచి నరసాపురం వైపునకు

57230	ప్యాసింజర్	విశాఖ–నరసాపురం–మచిలీపట్నం	డైలీ	03.05	03.50
57265	ప్యాసింజర్	విశాఖపట్నం – నరసాపురం	డైలీ	----	03.50
17403	ఎక్స్‌ప్రెస్	తిరుపతి – నరసాపురం	డైలీ	05.11	05.12
77202	ప్యాసింజర్	గుడివాడ –నరసాపురం	డైలీ	06.15	06.20
77242	ప్యాసింజర్	రాజమండ్రి –భీమవరం	డైలీ	07.10	----
17256	ఎక్స్‌ప్రెస్	హైదరాబాద్–నరసాపురం	డైలీ	07.05	07.10
57260	ప్యాసింజర్	రాజమండ్రి– నరసాపురం	డైలీ	10.25	10.30
77231	ప్యాసింజర్	విజయవాడ – భీమవరం	డైలీ	11.00	----
77233	ప్యాసింజర్	భీమవరం–నరసాపురం	డైలీ	----	11.20
17242	ఎక్స్‌ప్రెస్	విశాఖపట్నం –నరసాపురం	డైలీ	13.38	13.41
77204	ప్యాసింజర్	గుడివాడ –నరసాపురం	డైలీ	17.50	15.55

బుల్లితెర


www.sakshi.com

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 మనసులో మాట
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 బొమ్మ బొట బంగారు బాట
ఉ.09.30 మౌనరాగం
మ.12.00 పెళ్ళాంతో పనేంటి
మ.03.00 మా అన్నయ్య బంగారం
రా.09.00 నిన్నే ప్రేమిస్తా




మూవీస్ నౌ
ఉ.07.15 ఇమ్మొర్టల్స్
ఉ.08.55 స్పిసిస్
ఉ.10.45 చైల్డ్స్ ప్లే 2
మ.02.30 టుమారో నెవర్ డైస్
రా.10.50 సూపర్‌మ్యాన్ 3



హెచ్‌బీవో
ఉ.10.49 ఎక్స్‌ఎక్స్‌ఎక్స్
మ.12.55 ద డార్క్ నైట్
మ.03.26 ఘోస్ట్ షిప్
సా.04.56 ద హ్యాంగోవర్-2
రా.11.26 ద రింగ్



స్టార్ గోల్డ్
ఉ.07.05 ఇన్‌సైడియస్
మ.12.45 గోల్‌మాల్ 3
మ.03.50 తక్దీర్‌వాలా
సా.06.55 జాలీ ఎల్.ఎల్.బి.2
రా.10.00 దబాంగ్ 2



మా మూవీస్
ఉ.07.00 హ్యాపీ హ్యాపీగా
ఉ.09.00 రామదండు
మ.12.00 కరెంట్
మ.03.00 చారులత
సా.05.00 దేశముదురు



జీ సినిమా
ఉ.08.24 మాణిక్య
ఉ.11.27 మర్ద్
మ.02.57 అపరిచిత్: ద స్ట్రేంజర్
రా.09.00 రివాల్వర్ రాజా
రా.11.55 క్షత్రియ ద ఫైటర్

బులియన్ నరసాపురం

24 క్యారెట్ల బంగారం
10 గ్రాముల ధర రూ.29,670

22 క్యారెట్ల బంగారం
10 గ్రాముల ధర రూ.27,740

వెండి కిలో ధర రూ.39,530

కొబ్బరి ధరలు పాలకొల్లు



పాత కాయ
(వెయ్యింటికి) రూ. 10,000

కొత్త కాయ
(వెయ్యింటికి) రూ. 9,000



విగ్రహాల వివాదంలో నాటకీయ పరిణామాలు

పెనుగొండ :

జాతీయ నాయకుల విగ్రహాల పునఃప్రతిష్ఠ తీర్మానాలపై పెనుగొండలో బుధవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తొలగింపునకు నిరశనగా దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలు హోరెత్తాయి. దీంతో విగ్రహాల ఏర్పాటుపై పంచాయతీ తీర్మానం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో వివాద పరిష్కారానికి దళిత సంఘాల నాయకులతోనూ, పంచాయతీ సభ్యులతోనూ, గ్రామ పెద్దలతోనూ బుధవారం ఉదయం మంత్రి పితాని సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివాద పరిష్కారానికి ఇరువర్గాలు అంగీకారానికి వచ్చినట్టు ప్రకటించాయి.

- గ్రామ సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు పంచాయతీ సమావేశం ప్రారంభించారు. ఉదయం 11 గంటల వరకూ ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. కోరంకు సరిపడా సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. మంత్రి పితానితో సమావేశం అనంతరం పంచాయతీకి సభ్యులు చేరుకునేటప్పటికే సమావేశం వాయిదా పడింది. పంచాయతీలోనూ ఇరువర్గాలు సమావేశంపై గురువారం మరోసారి పంచాయతీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం ఆమోదించాలని నిర్ణయించుకున్నారు. ఒప్పందం ప్రకారం అన్ని విగ్రహాలను తొలగించి పంచాయతీ సూచించిన ప్రత్యేక ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవలసి ఉంది.



పెనుగొండ పంచాయతీలో నల్లి రాజేష్ చర్చలు

సాయంత్రానికి దీనిపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో ఒప్పందంపై నీలినీడలు అలముకున్నాయి. దీంతో గురువారం పంచాయతీ అత్యవసర సమావేశం ఏర్పాటుపైనా అనుమానాలు ఏర్పడ్డాయి. పంచాయతీలో జరిగిన సమావేశంలో జడ్పీటీసీ రొంగల రవికుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, జిల్లా సమన్వయకర్త నన్నేటి పుష్పరాజ్, మట్టా సుందర్రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కనపాల పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదరి పలివెల పైడియ్య, ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ముప్పిడి మోషే, కంకిపాటి కామేశ్వరరావు, గ్రామ పెద్దలు గాజుల పుల్లారావు, పోచల పోతురాజు, ఉపసర్పంచ్ ధీరజ్ పాల్గొన్నారు.

ముందు విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కాగా, దీనిపై మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ విలేకర్లతో మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుపై దళిత సంఘాలు అనుమానాలు వ్యక్తం చేయడం వలన ముందుగా తొలగించిన స్థానంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రాంతంలో అన్ని విగ్రహాలు ఏర్పాటు చేయడానికి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

పునఃప్రతిష్ఠ చేయాలి

పెనుగొండలో అధికారులు తొలగించిన జాతీయ నాయకులు అంబేడ్కర్, భగత్ సింగ్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలను వెంటనే పునఃప్రతిష్ఠ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పెనుగొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ నేతల విగ్రహాలను తొలగించడం దళితులను అవమానించడమేనన్నారు. ఓ పక్క అమరావతిలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మిస్తుంటే, మరో పక్క విగ్రహాలను తొలగించడం సిగ్గుచేటన్నారు. విగ్రహాలను తొలగించి దళితులను కించపరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వెంటనే విగ్రహాలను పునః ప్రతిష్ఠించకపోతే అన్ని దళిత, సామాజిక సంఘాలను కలుపుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బత్తుల విజయకుమార్, కె.రత్నరాజు, కె.పురుషోత్తం, మేకా నారాయణ, ఎ.గణేష్, వి.నరేష్ పాల్గొన్నారు.

ఇది పిరికి పంద చర్య

ఓ వ్యక్తి స్వలాభం కోసం దక్షిణ పేటకు చెందిన మైనర్ బాలురచేత గాంధీ బొమ్మల సెంటర్‌లో జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయించటం పిరికి పంద చర్యఅని జిల్లా మాలమహానాడు కార్యదరి గోగి గోపాలకృష్ణ విమర్శించారు. పెనుగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుల విగ్రహాలను పెట్టే సమయంలో పంచాయతీ తీర్మానం జరగాలనే అంశాన్ని పాటించకుండా దళితులు, ఇతర వర్గాల మధ్య చిచ్చుపెట్టడానికే నీచమైన ఆలోచన చేశారని ఆరోపించారు. విగ్రహాలను ఏర్పాటు చేయించి, తిరిగి పోలీసు, రెవెన్యూ శాఖల సహాయంతో తొలగించడమనేది బహు దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా వివాదాలు లేకుండా జాతీయ నాయకుల విగ్రహాలు ప్రభుత్వ అనుమతితో త్వరగా ఏర్పాటు చేయాలని హితవు పలికారు. పచ్చమాల ఆంజనేయులు, కుర్తాకుల భాను, దాసరి శివ, ఏలేటి తిరుపతిరావు, నక్కా వీరన్న, నక్కా అంబేద్కర్, గోగి ప్రభాకర్ పాల్గొన్నారు.

మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు శ్రీవల్లి మృతి



తమ్మినీడి శ్రీవల్లి

ఆచంట : టీడీపీ నాయకురాలు, ఆచంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు తమ్మినీడి శ్రీవల్లి(56) మంగళవారం గుండె పోటుతో మృతిచెందారు.కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ రాజమండ్రిలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో మృతిచెందారు. బుధవారం స్వగ్రామమైన ఆచంటలో అంత్యక్రియలు నిర్వహించారు. 2001 నుంచి 2006 వరకూ ఆచంట మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగి పనిచేశారు. భర్త తమ్మినీడి ప్రసాదు ప్రస్తుతం సిద్ధాంతం వాటర్ వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. శ్రీవల్లి మృతదేహాన్ని సందర్శించిన పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులు అర్పించారు. ఆమె మండల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పలువురి సంతాపం..

శ్రీవల్లి మృతి పట్ల మంత్రి పితాని సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ ఉప్పలపాటి సురేష్‌బాబు, గ్రామ సర్పంచ్ బీరా తిరుతపమ్మ, ఎంపీపీ మేకా పద్మకుమారి, జెడ్పీటీసీ బండి రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, కార్యదర్శి ఏడిద శ్రీనివాసు, ఆచంటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గొడవర్తి భగవాన్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి సతీష్, డీసీసీ కార్యదర్శి కానుమిల్లి జోగిరాజు, కాంగ్రెస్ నాయకులు నెక్కంటి బంగారం, సజ్జారామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వైట్ల కిషోర్‌కుమార్, కామన హరిబాబు, నెక్కంటి రామలింగేశ్వరరావు సంతాపం వ్యక్తంజేసిన వారిలో ఉన్నారు.

హరీష్ బాబు ఎంపిక పట్ల హర్షం

పెనుగొండ : బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ స్టేట్ కమిటీ కార్యదర్శిగా హరీష్‌బాబు కోటీని నియమించడం పట్ల బీఎస్ఎఫ్ మండల కార్యదర్శి జి.వరప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు. హరీష్ బాబును సంస్థ తెలుగు రాష్ట్రాల కో ఆర్డినేటర్ బొడ్డు కరుణాకర్ నియమించారని వివరించా రు. ఆంధ్రాయూనివర్శిటీలో జరిగిన సమావేశంలో ప్రమాణ స్వీకారం చేసిన హరీష్‌బాబు సంస్థ పటిష్టానికి, విద్యార్థి సమస్యల పరిష్కా రం కోసం కృషి చేస్తానని తెలిపారన్నారు.

25న జిన్నూరులో యూత్ రిట్రీట్

పోడూరు : లవ్ అండ్ పీస్ మినిస్ట్రీట్ ఆధ్వర్యంలో జిన్నూరు రూపాంతర దేవాలయంలో శుక్రవారం యూత్ రిట్రీట్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ మెర్సీబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 వరకు జరుగుతుంది. తాడేపల్లిగూడేనికి చెందిన వాక్యోపదేశకుడు రవి విన్సెంట్ ప్రసంగించనున్నారు.

ఉపాధ్యాయిని హైమావతి సేవలు ప్రశంసనీయం

పోడూరు : ఉపాధ్యాయిని వీరుభొట్ల హైమావతి సేవలు ప్రశంసనీయమని వేడంగి సర్పంచ్ మేకా నాగబాబు అన్నారు. వేడంగి మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసి మట్టపర్రు గ్రామానికి బదిలీ అయిన హైమావతిని బుధవారం పాఠశాలలో సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇక్కడ 8 ఏళ్లు ఉపాధ్యాయినిగా పనిచేసిన హైమావతి వందలాదిమంది విద్యార్థులను క్రమశిక్షణ, చక్కని విద్యాబుద్ధులతో తీర్చిదిద్దారన్నారు. ఉపసర్పంచ్ బొలిశెట్టి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ హైమావతి ఆదర్శనీయురాలని ప్రశంసించారు. ఆమె సత్యసాయి సేవా సమాజం సభ్యురాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హైమావతి, వారణాశి శ్రీనివాసరావు దంపతులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. హెచ్ఎం ఎన్వీ నరసింహరావు, విద్యాకమిటీ చైర్మన్ చెల్లబోయిన వెంకటరత్నం, సొసైటీ డైరెక్టర్ కొండేటి సుభాష్‌చంద్రబోస్, ఉపాధ్యాయులు జి.పెద్దిరాజు, బి.లలితకుమారి, ప్రసన్న పాల్గొన్నారు.

31న సంచార జాతుల స్వాతంత్ర్య వేడుక

ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల సంఘం అధ్యక్షుడు వీరన్న



బ్రాహ్మణచెరువులో జరిగిన సంచార జాతుల సమావేశం

పెనుమంట్ర :

ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న పాలకొల్లులో నిర్వహించనున్న భారత విముక్త సంచార జాతుల స్వాతంత్ర్య దిన వేడుకలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న విజ్ఞప్తి చేశారు. బుధవారం పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులో సంచార జాతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీసీ కులాలకంటే ఎంతో వెనుకబడిఉన్న సంచా ర జాతులను బీసీ జాబితాలో చేర్చడంతో తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఏళ్ల తరబడి రాజ్యాంగ హక్కులు కూడా పొందకుండా సంచార జాతులు కనుమరుగైపోతున్నాయని వాపోయారు. జాతీయ సంచార జాతుల కమిషన్ సిఫార్సులు ప్రకారం 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు ఈ జాతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. పాలకొల్లు సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్, చర్మకారుల హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేళంగి శ్యాం, వాడపల్లి పుల్లయ్య, సిరాపు యేసు, పెండ్ర బొండియ్య, వాడపల్లి పెద్దిరాజు, ప్రసాదం శివ పాల్గొంటారన్నారు.



పాడి-పంట

కోకోపై తెగుళ్లతో తీవ్రనష్టం

పెరవలి :

జిల్లాలో కోకో సాగు 12,563 హెక్టార్లలో సాగవుతోంది. నిడదవోలు నియోజకవర్గంలో కోకో 180 ఎకరాల్లో సాగవుతోంది. కోకో తోటలపై తెగుళ్ల దాడిచేయడంతో పంట దెబ్బతిం టోంది. పంటలపై సోకిన తెగుళ్ల కార ణంగా ఆకులు రాలిపోయి మొక్కలు పాడైపోతున్నాయి. ప్రస్తుతం కోకో మొక్కలు పూత, పిందె, కాయ దశలో ఉన్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పూత మాడిపోయి రాలిపోవడం, పిందెలకు వివిధ రకాల తెగుళ్ల సోకడం, కాయలపై తుప్పు తెగులు, బూజుతెగులు, కాయ కుళ్లు తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సస్యరక్షణ చర్యలను పెరవలి వ్యవసాయాధికారి పి. చంద్ర శేఖర్ పలు సూచనలు చేశారు.



తీపర్రులో కొబ్బరిలో కోకో తోట, (అంతరచిత్రం) పి.చంద్రశేఖర్, వ్యవసాయాధికారి, పెరవలి

బూజు తెగులు

ఈ తెగులు 3 రకాల శిలీంద్రాల ద్వారా వ్యాపిస్తుంది. ఇది కాయలతో పాటు చెట్టును కూడా ఆశించి క్షీణింపజేస్తుంది. తెగులు ఉధృతి అధికంగా ఉంటే మొక్కపై తెల్లని పౌడర్‌లా ఏర్పడి రాలుతుంది. కాయలు కుళ్లడంతోపాటు మొక్క చనిపోతుంది. తెగులు సోకిన ప్రాంతంలో శుభ్రపరిచి ఆయా మొక్క భాగాలను తొలగించాలి.

నివారణ చర్యలు

తెగులు సోకినట్లు గుర్తించిన వెంటనే సెబ్యూరకొనోజాల్ +అజాక్సీ క్లోబిన్ ఎకరానికి 220 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి లేదా పెప్లోక్సీక్లోబిన్ 180 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆకుతేలు

ఆకుతేలు పురుగు పంటపై ఆశించిన ప్పుడు ఆకులను చిల్లులు పెట్టి అందు లో ఉండే పత్రహరితాన్ని పీల్చివేస్తాయి. లేత ఆకులను తినివేస్తాయి. ముదర చెట్ల కన్నా లేత చెట్లపైనే వీటిప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకులు ఎన్ని తిన్నా మరలా కొత్త ఆకులు వస్తాయి.

నివారణ చర్యలు

రోగార్ 2 మిల్లీలీటర్ల మందును ఒక లీటరు నీటిలో లేదా మోనోక్రోటోపస్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కల పాలి. 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే తెగులు నివారణ అవుతుంది.



తెగులు సోకి మాడిపోయిన పిందెలు



తుప్ప తెగులు సోకిన కోకో కాయలు

తుప్పుమచ్చ : కోకో కాయలపై తుప్పుమచ్చ తెగులు ఎక్కువగా ఆశించి ఉంటుంది. ఈ తెగులు సోకిన కాయలపై మచ్చమచ్చలు ఏర్పడి క్రమేపీ కాయంతా నల్లగా మారిపో తుంది. పిందెలపై ఆశించినప్పుడు పిందె మొత్తం మాడిపోతుంది. కోకోలో ఈ తెగులు సోకితే కాయలు నాణ్యత కోల్పోవడంతో పాటు దిగు బడి తగ్గిపోతుంది. ఇది తామరపురుగు లు, నల్లి వల్ల ఎక్కువగా వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

ఈ తెగులు ఆశించిన వెంటనే ఎసి టామీప్రిడ్ 4 గ్రాములు 10 లీటర్ల నీటి లో కలిపి లేదా డైమిథోయేట్ 3 మిల్లీలీ టర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగులు నివారించవచ్చు.

పూత,పిందె రాలుట

కోకో పంట నవంబర్-డిసెంబర్‌లో పూత,పిందె ఏర్పడతాయి. వాతావర ణంలో మార్పులు వచ్చినా, ఎరువుల యాజమాన్యం సక్రమంగా పాటించక పోయినా పూత,పిందె రాలుతుంది.

నివారణ చర్యలు

పూత ఏర్పడిన వెంటనే డీఏపీ 20 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి లేదా ప్లెనోఫ్లిక్స్ 3 గ్రాములు మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత,పిందె నిలబడి మంచి దిగుబడినిస్తాయి.

పండుకుళ్లు : కోకో పంటలో అత్యంత ప్రమాదకరమైంది ఫ్రూట్‌రాట్ (పండు కుళ్లు) తెగులు. ఇది కాయలను నేరు గా సోకి కాయలు కుళ్లిపోతాయి. కాయపై మచ్చగా ఏర్పడి లోపలంతా కుళ్లిపోవడంతో దిగుబడి అనూహ్యంగా తగ్గిపోతుంది. ఇది ఫంగస్ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు సోకితే కాయల నాణ్యత కోల్పోతాయి. పిందె, కాయ సమయంలో ఎక్కువగా ఆశిస్తుంది.

నివారణ చర్యలు

కాయలపై ఈ తెగులు సోకిన వెంటనే కాపర్‌ఆక్సీక్లోరైడ్ 1 లీటరు నీటిలో 3 మిల్లీలీటర్లు లేదా మాంకోజెబ్ లీటరు నీటికి రెండున్నర మిల్లీలీటర్లు లేదా ప్రొపీకోనోజాల్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగులును నివారించవచ్చు.

ఎరువుల యాజమాన్యం

కోకో పంటకు ప్రతి రెండు నెలలకు ఒకసారి ఎరువులను సమాంతరంగా అందించాలి. ప్రతి మొక్కకు మూడేళ్ల వయస్సు లోపు కలిగిన మొక్కలకు యూరియా 90గ్రాములు, సూపర్‌ఫాస్పేట్ 90 గ్రాములు, పొటాష్ 90 గ్రాములు వేయాలి. మూడేళ్ల వయస్సు దాటిన మొక్కలకు 125 నుంచి 150 గ్రాముల వరకు 3 రకాల ఎరువులను సమాంత రంగా అందించాలి. ఎరువులు, సాగు నీరు ఈ సమయంలో అందిస్తే పంట దిగుబడి అధికంగా ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగు లాభసాటి

అత్తిలి : నిర్ణీత మోతాదులో ఎరువు లను వినియోగించి, యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా వరి సాగు లాభసాటిగా ఉంటుందని ఉండి కృషివిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధా జాకబ్ అన్నారు. ఉండి కృషివిజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాలూరులో బుధవారం రైతులకు ఆడియో కాన్ఫ రెన్స్ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమం లో పాల్గొన్న అభ్యుదయ రైతులు అడి గిన పలు సందేహాలను శాస్త్రవేత్త సుధాజాకబ్ నివృత్తి చేశారు. రిల యెన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ వరహాలు మాట్లాడుతూ సాంకే తిక విజ్ఞానంతోపాటు సంస్థ అందిస్తున్న సేవలను వినియోగించు కుని మేలైన దిగుబడులు సాధించవ చ్చన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1800 419 8800 కాల్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శరకడం అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు, కోడెల వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.



పాలూరులో రైతులతో మాట్లాడుతున్న ఉండి కృషివిజ్ఞాన కేంద్రం సభ్యులు

వారధి.. నిర్మాణానికి దారేది..!

- వశిష్ట వంతెన నిర్మాణంలో రోజుకో మెలిక
- ముందు డ్రెడ్జింగ్ హార్బర్ నిధులతో అని..
- ఇప్పుడు జాతీయ రహదారికి అనుసంధానంగా అంటూ..
- కలల వారధిపై నీలినీడలు • అస్పష్ట ప్రకటనలతో అయోమయం


నరసాపురంలో వశిష్ట గోదావరిపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతం


వశిష్ట వంతెన నిర్మాణానికి తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లిలో వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన శంకుస్థాపన ఫలకం

నరసాపురం:

ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ నరసాపురంలో వశిష్ట గోదావరి నదిపై వంతెన నిర్మాణం విషయంలో అస్పష్ట ప్రకనటలతో అయోమయం నెలకొంది. ప్రజాప్రతినిధులు రోజుకో ప్రకటన చేయడంతో నిర్మాణంపై నీలినీడలు తొలగడం లేదు. 2016 ఫిబ్రవరి 18న నరసాపురం పక్కనే ఉన్న తూర్పు గోదావరి జిల్లా అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చింది. హార్బన్ నిర్మాణానికి రూ.1,800 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. సరిగ్గా నెలలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి మరో ప్రకటన వచ్చింది. డ్రెడ్జింగ్ హార్బర్ నిధుల్లో రూ.200 కోట్లు ఖర్చు చేసి ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ నరసాపురం వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం చేపడుతున్నట్టు దాని సారాంశం. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని ఒప్పించారని స్థానిక ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు చెప్పుకొచ్చారు. నితిన్‌గడ్కరీకి ఈ మేరకు సీఎం చంద్రబాబు రాసిన లేఖంటూ పత్రికలకు విడుదల చేశారు. ఇంకేముంది కేంద్రం సహకారంతో కలల వారధి కచ్చితంగా నిర్మాణం జరిగి తీరుతుందని అందరూ భావించారు. టీడీపీ నాయకులు గోదావరి రేవు వద్ద మిఠాయిలు కూడా పంచారు. బీజేపీ నాయకులు బ్యానర్లు కట్టి ఇది తమ ఘనత అంటూ ప్రచారం చేసుకున్నారు. ఇది జరిగిన 19 నెలలు గడుస్తోంది.

216కు అనుసంధానం అంటూ..

ఇదిలా ఉండగా గతనెల 20న ఉభయగోదావరి జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిశారు. అయితే డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణం, వంతెనకు నిధుల మళ్లింపు అంశాన్ని పక్కకు పెట్టారు. ప్రస్తుతం చించినాడ నుంచి నరసాపురం మీదుగా 216 జాతీయరహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ–సఖినేటిపల్లి రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్పుచేసి, సఖినేటిపల్లి నుంచి రహదారిని నరసాపురంలో 216 రహదారికి అనుసంధానం చేయాలని, దీనిలో భాగంగా నరసాపురంలో వశిష్ట గోదావరిపై వంతెన నిర్మించాలని వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు నితిన్‌గడ్కరీ అంగీకరించారని, నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో సహా ఢిల్లీ వెళ్లిన బృందంలోని నాయకులు చెబుతున్నారు. ఇలా రోజుకో ప్రకటనతో పాలకపక్షం నాయకులు వంతెన నిర్మాణం విషయంలో దోబూచులాడుతున్నారు. దీంతో ప్రజలు అయోమయంలో ఉన్నారు. గోదావరిజిల్లా వాసుల దశాబ్దాల కోరిక వశిష్ట వారధి విషయంలో ఎక్కడా లేనివిధంగా నాలుగుసార్లు శంకుస్థాపనలు జరిగాయి. ఐదుగురు ముఖ్యమంత్రులు వంతెనపై దృష్టిపెట్టారు. స్వయంగా ప్రకటనలు చేశారు. అయినా ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు.

వైఎస్ హయాంలో రూ.194 కోట్లతో టెండర్లు

నరసాపురం వశిష్ట వంతెన విషయంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే చొరవ చూపారు. ఆయన పాదయాత్రల సమయంలో తీరంలో పర్యటించినప్పుడు, వంతెన అవసరాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. దీంతో ఆయన రెండోసారి అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణంపై దృష్టిపెట్టారు. 2008 ఏప్రిల్ 15న వశిష్ట వంతెనకు తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లిలో శంకుస్థాపన చేశారు. అక్కడితో సరిపెట్టకుండా రూ.194 కోట్లతో టెండర్ పిలిచి నిర్మాణ పనులను సత్యంకు అనుబంధ సంస్థ మైటాస్‌కు అప్పగించారు. ప్రాథమికంగా సర్వేలు పూర్తయ్యాయి, ఇక వంతెన పనులు ప్రారంభమవుతాయనగా సత్యం సంస్థ సంక్షోభంలోకి వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. అయితే వేరే కంపెనీకి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అంతలో ఆయన మృతిచెందారు. మైటాస్ వద్ద సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వేరే కంపెనీ పనులు చేపట్టడానికి ముందుకు వచ్చినా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు శ్రద్ధ చూపలేదు. దీంతో ఇది దశాబ్దాల కలగానే మిగిలిపోయింది.

చిత్తశుద్ధి ఉండాలి



వంతెన నిర్మాణ విషయంలో చిత్తశుద్ధి ఉండాలి. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన వెంటనే టెండర్ పిలిపించి, పనులు మైటాస్ సంస్థకు అప్పగించారు. ఆయన బతికుంటే ఎప్పుడో బ్రిడ్జి పూర్తయ్యేది. మొన్న డెడ్జింగ్ హార్బర్ నిధులతో పనులు అయిపోతున్నాయి అన్నారు. ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణ, అనుసంధానం అంటున్నారు. స్పష్టత లేదు.

– ముదునూరి ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే

కచ్చితంగా పూర్తవుతుంది



కచ్చితంగా వంతెన నిర్మాణం పూర్తవుతుంది. అనివార్య కారణాలవల్ల డ్రెడ్జింగ్ హార్బర్ పనులు మొదలుకాలేదు. దీంతో వంతెన నిర్మాణంపై అవకాశం ఉన్న మేర మరో అవకాశంపై దృష్టిపెట్టాం. ఎంపీలు, ఎమ్మెల్యేలు బృందంగా ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిశాం. ఆయన సానుకూలంగా స్పందించారు.

– బండారు మాధవనాయుడు, ఎమ్మెల్యే, నరసాపురం

'పోలవరం'పై రాష్ట్ర ప్రభుత్వ ప్రచారం సరికాదు


బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాస వర్మ

ఏలూరు (ఆర్ఆర్ పేట) : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం తానే నిర్మిస్తున్నట్టు ప్రచారం చేసుకోవడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక నరసింహారావుపేటలో విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం మొత్తాన్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ పర్యవేక్షిస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో పార్టీకి సంబంధించి ఎక్కువ సభ్యత్వం గల జిల్లాగా పశ్చిమగోదావరి జిల్లా గుర్తింపు పొందిందని, అలాగే క్రియాశీల సభ్యుల విషయంలో జిల్లానే రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉందని చెప్పారు. జిల్లాలోని 54 మండలాల్లో పార్టీకి సంబంధించిన అన్నివిభాగాల నిర్మాణం పూర్తిచేశామని, అలాగే 90 శాతం వరకూ బూత్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పర్యటిస్తున్నారని, ఈ మేరకు ఈనెల 28 నుంచి 30 వరకూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటన చేస్తారని చెప్పారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్లళ్ల సుధాకర్‌కృష్ణ, నగర అధ్యక్షుడు నాగం శివ పాల్గొన్నారు.

ఆక్వాపార్క్ గ్రామాల్లో పోలీసుల మోహరింపు


భీమవరం మండలంలోని జొన్నలగరువులో మోహరించిన పోలీసులు

భీమవరం అర్బన్: గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న తుందుర్రు, జొన్నలగరువు, కంసాలి బేతపూడి గ్రామాల్లో బుధవారం భారీగా పోలీసులు మోహరించారు. పోరాట కమిటీ నాయకులు ర్యాలీలు, నిరసనల నేపథ్యంలో సుమారు 600 మంది పోలీసులు ఫ్యాక్టరీకి పహారా కాస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడిబడితే అక్కడ పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేసి బయటి వ్యక్తులను గ్రామాల్లోకి రానివ్వకుండా చూస్తున్నారు. వందలాది మంది పోలీసుల మోహరింపు దారుణమని, పిల్లలు భయపడుతున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

బిగుసుకుంటున్న ఉద్యమ పిడికిళ్లు

త్వరలో ఫుడ్‌పార్కుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరగబోతున్నాయని రహస్య సమాచారం మేరకు పోలీసు యంత్రాంగం బలగాలను మోహరించినట్టు తెలుస్తోంది. ఫుడ్ పార్కు ఫ్యాక్టరీ ఆగేవరకూ తమ పోరాటం ఆగదని పోరాట కమిటీ నాయకులు తెగేసి చెబుతున్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర


చైతన్యయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ సుబ్బారావు

భీమవరం: జిల్లాలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర, 26న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు పిలుపునిచ్చారు. అగ్రిగోల్డ్ బాధిత సంఘం, అగ్రిగోల్డ్ పరివార్ ఏజెన్సీ అసోసియేషన్ నాయకులతో కలిసి బుధవారం భీమవరంలో చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త చైతన్య యత్ర గురువారం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ యాత్ర తణుకు, పాలకొల్లు, భీమవరం పట్టణాల్లో నిర్వహించి 26న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, గోపాలకృష్ణ, కేవీ ప్రసాద్, వై.నారాయణ, జేవీవీ భాస్కరరావు, ఎం.పల్లప్ప, వైవీ కృష్ణ పాల్గొన్నారు.

నెమ్మదిస్తున్న గోదావరి వరద

కొవ్వూరు: గోదావరిలో వరద నెమ్మదిస్తోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద బుధవారం సాయంత్రం 10.60 అడుగులు నమోదైంది. ఉభయగోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు 10,200 క్యూసెక్కులకు వదులుతున్నారు. తూర్పుడెల్టాకు 4,100, సెంట్రల్ డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు చొప్పున సాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 2,09,286 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు.

పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు

పశ్చిమ డెల్టాకు బుధవారం సాయంత్రం నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. దీనిలో జీ అండ్ వీ కెనాల్‌కు 174, నరసాపురం కాలువకు 731, ఉండి కాలువకు 108, ఏలూరు కెనాల్‌కు 371, అత్తిలి కాలువకు 74 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు.


నేడు పోలవరం అథారిటీ కమిటీ పర్యటన

పోలవరం: పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ కమిటీ గురువారం పోలవరం ప్రాజెక్ట్ పనులను సందర్శించనుంది. అథారిటీ కమిటీ కార్యదర్శి అమర్జిత్ సింగ్ ఆధ్వరంలో 10 మంది కమిటీ సభ్యుల బృందం ఉదయం 11 గంటలకు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతానికి చేరుకుంటారు. పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

పెద్దిరాజు మృతదేహం లభ్యం

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో వేటకు వెళ్లి గల్లంతైన పెద్దిరాజు మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈనెల 19న ముత్యాలపల్లి గ్రామానికి చెందిన పెద్దిరాజు, కోటేశ్వరరావు వేటకు వెళ్లారు. అదే రోజు కోటేశ్వరరావు ఏటిలోపడి గల్లంతుకాగా 20న మృతదేహం లభ్యమైంది. అయితే పెద్దిరాజు ఆచూకీ మాత్రం లభించలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అప్పటినుంచి గాలిస్తుండగా బుధవారం ఉదయం మోడీ వంతెన సమీపంలోని పశ్చిమ కుక్కులేరు డ్రెయిన్‌లో పెద్దిరాజు (25) మృతదేహం లభ్యమైంది. మృతుడు తల్లి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వై.నాగేశ్వరరావు చెప్పారు.

ఘనపతింభజే !



ఆదిదేవుడు గణపతి పూజకు వేళయింది. హిందూ సంప్రదాయంలో తొలి పెద్ద పండగ గణపతి నవరాత్రులే.. ఇవి శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో అందరూ గణపతింభజే అంటూ గణనాథుని ఘనంగా కొలిచేందుకు సిద్ధమవుతున్నారు. ప్రతిమల కొనుగోలు, పూజాసామగ్రి సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో సంప్రదాయాన్ని ప్రతిబింబించే కథనం..

- » ఏకదంతాయ.. ఆరోగ్య ప్రదాయ..
- » మట్టి ప్రతిమా.. పర్యావరణ హితమా..
- » పూజా పత్రి.. మన వైద్య సంపత్తి
- » గణపతి పూజల్లో నిగూఢ సత్యాలు
- » ఆధునికత పేరుతో సంప్రదాయం అంతం



పూళ్లలో విగ్రహాలను తీర్చిదిద్దుతున్న మహిళలు

ఏలూరు (మెట్రో) :

గణపతి నవరాత్రులు సంప్రదాయం ఈనాటిది కాదు. తరతరాలుగా వస్తోంది. ఈ పండగ నిర్వహణ, పూజా సామగ్రి వాడకం వెనుక ఎన్నెన్నో మనకు తెలీని సత్యాలు దాగున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనం మన సంప్రదాయాన్ని మర్చిపోయాం. పండగ రూపురేఖలను మార్చేశాం. మట్టి ప్రతిమలకు బదులు రంగురంగుల బొమ్మలను పూజిస్తున్నాం. ఇది పర్యావరణానికి హానికరమని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ఇది మన సంప్రదాయం కాదని పండితులూ ఘోషిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పులేదు. అలాగే విఘ్నేశ్వరుని పూజించే పత్రిల్లోనూ ఆరోగ్య సూత్రాలు దాగున్నాయి.



ఐక్యతకు చిహ్నం

ఇప్పుడు ఊరూవాడా ఏకమై గణపతి నవరాత్రులను ఘనంగా జరుపుకుంటున్నాం. అయితే పూర్వం ఇలా సామూహికంగా జరిగేవి కావు. ఎవరికి వారు ఇళ్లవద్దే పూజలు జరుపుకునేవారు. అయితే 1893లో జాతీయ కాంగ్రెస్ నేత బాలగంగాధర్ తిలక్ ప్రజల్లో ఐక్యతను పెంచి స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడిపేందుకు గణపతి నవరాత్రుల వేడుకలను నిర్వహించడం ప్రారంభించారు. అప్పటి నుంచి సామూహికంగా వేడుకలు జరపడం మొదలైంది. అదే ఐక్యతకు చిహ్నమైంది. అందుకే ఇప్పుడు చిన్నచిన్న గ్రామాల్లోనూ గణపతి నవరాత్రులంటే ప్రజలంతా ఒక్కటైపోతారు. అంగరంగవైభవంగా వేడుకలు నిర్వహిస్తారు.

పూజాసామగ్రిలో ఆరోగ్య రహస్యం

వినాయక చవితి వర్షాకాలంలో వస్తుంది. ఈ కాలంలో వ్యాధికారక క్రిముల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా ప్రజలు వ్యాధులకు గురవుతారు. దీనిని గ్రహించిన పూర్వీకులు చవితి పూజల్లో పత్రి వాడకాన్ని ప్రారంభించారు. అనేక రకాల ఔషధ గుణాలున్న ఆకులతో పూజలు చేస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారని యోచించారు. 21 రకాల ఆకులతో పూజ చేయాలని నిబంధనపెట్టారు. వీటినే మనం పత్రిగా పిలుస్తున్నాం.

'మట్టి'మేలు తలపెడదాం

భీమడోలు : మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. మట్టిమేలు తలపెడదాం.. అంటూ పర్యావరణవేత్తలు నినదిస్తున్నారు. పాఠశాలలు, విద్యాసంస్థల విద్యార్థులూ ప్రచార బాట పట్టారు. కళాకారులూ మట్టి ప్రతిమలను తయారు చేసి హానికరం కాని రంగులు అద్దుతున్నారు. దీనిలో మహిళా కళాకారులూ భాగస్వాములు అవుతున్నారు. భీమడోలు మండలం పూళ్ల, పోలసానిపల్లిలో మట్టి విగ్రహాల తయారీ ఎక్కువగా జరుగుతోంది.

చాలా సంతోషంగా ఉంది



మా నాన్న పేరవపు నాగేశ్వరరావు 50 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. చిన్నతనం నుంచి మా తండ్రి నేర్పిన ఈ వృత్తిని వదలలేదు. వివాహమైంది. అయినా పండుగ వేళల్లో మా నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ విగ్రహాల రూపకల్పనలో సహకరిస్తున్నాను. మట్టి విగ్రహాల తయారీ సంతోషంగా ఉంది.

– లంకా భారతి, కళాకారిణి, పోలసానిపల్లి

ఓం సముఖాయ నమః మాచీపత్రం పూజయామి



1

మాచీ పత్రం : తెలుగులో దీనిని మాచ పత్రి అంటారు. చామంతి జాతికి చెందిన ఈ ఆకులు సువాసన వెదజల్లుతాయి. ఇవి దద్దుర్లు, తలనొప్పి, వాత నొప్పులు, కంటి, చర్మ సంబంధ వ్యాధులను తగ్గిస్తాయి.

ఓం గణాధిపాయ నమః బృహతీ పత్రం పూజయామి



2

బృహతీ పత్రం : దీనిని ములక, వాకుడాకు అంటారు. ఇవి వంగ ఆకుల మాదిరి, తెల్లని చారలుండే గుండ్రని పండ్లతో ఉంటాయి. ఇది దగ్గు, జలుబు, జ్వరం, అజీర్ణం, మూత్ర, నేత్ర వ్యాధులను నయం చేస్తుంది. దంత ధావనానికి కూడా ఉపయోగిస్తారు.

ఓం ఉమాపుత్రాయ నమః బిల్వ పత్రం పూజయామి



3

బిల్వ పత్రం : బిల్వ పత్రం అంటే మారేడు ఆకు. మూడు ఆకులుగా, ఒక ఆకుగా కూడా లభ్యమవుతాయి. ఇవి శివుడికి ఇష్టమైనవి. మహాలక్ష్మికి కూడా ఇష్టమైనవని చెబుతారు. ఇది జిగట విరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్ర వ్యాధులు, శరీర దుర్గంధాన్ని తగ్గిస్తుంది.

ఓం గజాననాయ నమః దూర్వాయుగ్మం పూజయామి



4

దూర్వా యుగ్మం : దూర్వా యుగ్మం అంటే గరిక. ఇందులో తెల్ల గరిక, నల్ల గరిక అనే రకాలున్నాయి. ఇది వినాయకుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది. చర్మ వ్యాధులు, దద్దుర్లు, మూత్రంలో మంట, ముక్కు, ఉదర సంబంధ వ్యాధులు, అర్శ మొలలను నివారిస్తుంది.

ఓం హరసూనవే నమః దత్తూర పత్రం పూజయామి



5

దత్తూర పత్రం : దత్తూర అంటే ఉమ్మెత్త మొక్క. ఇది సెగ గడ్డలు, స్తనవాపు, చర్మ, శ్వాసకోశ వ్యాధులు, పేను కొరుకుడు, నొప్పులు, రుతు వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది. ఇది విషం కాబట్టి జాగ్రత్తగా వాడుకోవాలి.

ఓం లంబోదరాయ నమః బదరీ పత్రం పూజయామి



6

బదరీ పత్రం : బదరీ పత్రం అంటే రేగు ఆకు. ఇందులో రేగు, జిట్రేగు, గంగరేగు అనే మూడు రకాలున్నాయి. జీర్ణకోశ, రక్త సంబంధ వ్యాధులు, చిన్న పిల్లలకు వచ్చే వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.

పూజా పత్రం.. ఆరోగ్య హితం..

హాగ్రజాయనమః
ూర్వ పత్రం
యామి



ర్వ పత్రం : తెలుగులో
అంటారు. గింజలు
ముళ్లను కలిగి ఉంటా యి.
త ధావనానికి, పిప్పి పన్ను, చెవిపోటు, రక్తం
అర్శమొలలు, ఆణెలు, గడ్డలు, అతి ఆకలి,
మూత్ర పిండాలలో రాళ్లను నివారించడానికి ఉప
డుతుంది.

జకర్ణాయనమః
పత్రం పూజయామి



్రతం : హిందువులు దేవ
ో వీటిని విధిగా వాడ
ది దగ్గు, జలుబు,
చెవిపోటు, పన్ను
తుమ్ములు, చుండ్రు,
, గాయాలను తగ్గి
ముఖ సౌందర్యం, వ్యాధి
శక్తిని పెంపొందిస్తుంది.

కదంతాయ నమః
పత్రం పూజయామి



త్రం : అంటే
ఆకు. ఈ ఆకులకు
్యల్లో విశిష్ట స్థానం
ిటిని వాడని
గృహాలు ఎక్కడా
ఇది రక్త విరేచనాలు,
్ధులు, ఇంట్లోని క్రిమికీ
వారణకు ఉపయోగపడుతుంది.

కటాయ నమః
పత్రం పూజయామి



త్రం : దీనినే
అంటారు. దీని
తెలుపు, పసుపు,
ంగుల్లో ఉంటాయి.
లకు పూజల్లో విశిష్ట
ంది. ఇది కణుతులు,
ట్లు, విషకీటకాల కాట్లు, దురద, కంటి సంబంధ,
బంధ వ్యాధులను తగ్గిస్తుంది.

న్నదంతాయ నమః
ాంత పత్రం పూజయామి



ంత పత్రం : ఇది
లుపు పువ్వులుండే
క్క. నీలం రంగు
ండే మొక్కను విష్ణు
ని పిలుస్తారు. ఇది
ఫం, పడిశం, దగ్గు,
వంటి వ్యాధులను తగ్గించడానికి, జ్ఞాపక శక్తిని
దించడానికి ఉపయోగపడుతుంది.

టవే నమః
ు పత్రం
యామి



త్రం : దాడిమీ
నిమ్మ మొక్క. శక్తి
ి అంబకు దాడిమీ ఫల
ఎంతో ఇష్టం. అతిసారం, విరేచనాలు, దగ్గు,
అర్శమొలలు, ముక్కు నుంచి రక్తం కారటం,
ంకలు, గొంతు నొప్పి, చర్మవ్యాధుల్ని తగ్గిస్తుంది.



ఓం సర్వేశ్వరాయ నమః
దేవదారు పత్రం పూజయామి



దేవదారు పత్రం : దేవతలకు అత్యంత ఇష్టమైన ఆకు దేవదారు. దీని మానుతో చెక్కే విగ్రహాలకు సహజత్వం ఉంటుంది. ఇది అజీర్తి, పొట్ట సంబంధ వ్యాధులు, చర్మవ్యాధులు, కంటి వ్యాధులను తగ్గిస్తుంది.

ఓం పాలచంద్రాయ నమః
మరువక పత్రం పూజయామి



మరువక పత్రం : వీటిని ధవనం, మరువం అంటారు. ఆకులు ఎండినా సువాసన వెదజల్లటం దీని ప్రత్యేకత. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. జుట్టు రాలటం, చర్మ వ్యాధులను తగ్గిస్తుంది.

ఓం హేరంభాయ నమః
సింధువార పత్రం పూజయామి



సింధువార పత్రం : వీటినే వావిలి అంటారు. ఇవి జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులు, గాయాలు, చెవిపోటు, చర్మ వ్యాధులు, మూర్చ వ్యాధి, ప్రసవం అనంతరం వచ్చే ఇబ్బందులను తగ్గిస్తాయి.

ఓం శూర్పకర్ణాయ నమః
జాజీ పత్రం పూజయామి



జాజి పత్రం : ఇది సన్న జాజిగా పిలవబడే మల్లి జాతి మొక్క. వీటి పువ్వుల నుంచి సుగంధ తైలం తీస్తారు. వాత నొప్పులు, జీర్ణాశయ వ్యాధులు, మలాశయ వ్యాధులు, నోటిపూత, దుర్వాసన, కామెర్లు, చర్మవ్యాధులను తగ్గిస్తుంది.

ఓం సురాగ్రజాయ నమః
గండకీ పత్రం పూజయామి



గండకీ పత్రం : దీనిని లతా దూర్వా, దేవకాంచనం అంటారు. మూర్ఛ, కఫం, పొట్ట సంబంధ వ్యాధులు, నులి పురుగులను నివారిస్తుంది. దీని ఆకులను ఆహారంగా కూడా వినియోగిస్తారు.

ఓం ఇభవక్త్రాయ నమః
శమీ పత్రం పూజయామి




శమీ పత్రం : జమ్మి చెట్టు ఆకులనే శమీ పత్రాలంటారు. ఇది కఫం, మూలవ్యాధి, కుష్టు వ్యాధి, అతిసారం, దంత వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడుతుంది.

ఓం వినాయకాయ నమః
అశ్వత్థ పత్రం పూజయామి



అశ్వత్థ పత్రం : రావి ఆకులను అశ్వత్థ పత్రాలంటారు. ఇవి మల బద్ధకం, కామెర్లు, వాంతులు, మూత్ర వ్యాధులు, జ్వరాలు, నోటిపూత, చర్మ వ్యాధులను నివారిస్తాయి. జీర్ణశక్తిని, జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయి.

ఓం సురసేవితాయ నమః
అర్జున పత్రం పూజయామి



అర్జున పత్రం : తెల్ల మద్ది చెట్టు ఆకులను అర్జున పత్రాలంటారు. ఇవి మర్రి ఆకులను పోలి ఉంటాయి. ఇది అడవులలో పెరిగే పెద్ద వృక్షం. చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, మలాశయ దోషాలు, గుండె జబ్బుల నివారణకు బాగా పనిచేస్తుంది.

ఓం కపిలాయనమః
అర్కపత్రం పూజయామి



అర్క పత్రం : జిల్లేడు ఆకులను అర్క పత్రాలంటారు. శివుడికి ప్రీతిపాత్రమైనవి. ఇవి చర్మ వ్యాధులు, సెగ్గడ్డలు, కీళ్ల నొప్పులు, చెవిపోటు, కోరింత దగ్గు, దంతశూరి, విరేచనాలు, తిమ్మిర్లు, బోదకాలు, వ్రణాలను తగ్గిస్తాయి.



సుస్వాగతం.. నవరాగమా..

విట్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



డ్యాన్సులతో అదరగొడుతున్న విద్యార్థులు



భీమవరం : సుస్వాగతం.. నవరాగమా.. వెల్‌కమ్.. వెల్‌కమ్.. అంటూ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకల్లో సందడి చేశారు. పట్టణంలోని విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల (విట్) విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం జరిగాయి. పాటలు, డ్యాన్సులతో విద్యార్థులు సందడి చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కృషి పట్టుదలతో విద్యాభ్యాసం చేస్తే ఉద్యోగాలు సాధించడం కష్టమేమి కాదన్నారు. తోటి విద్యార్థులతో సఖ్యతగా వ్యవహరిస్తూ తమకు తెలియని విషయాలను ఇతర విద్యార్థుల ద్వారా నేర్చుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. చదువుతో పాటు గేట్, సివిల్స్, జీఆర్‌ఈ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రసాద రాజు, ఏజీఎం రమేష్‌రాజు పాల్గొన్నారు.








వక్రతుండాయా.. బహురూపాయ..!

వక్రతుండాయా.. బహురూపాయా..! అంటూ విద్యార్థులు గణపతిని భక్తితో కొలిచారు. వినూత్నంగా గణనాథుని రూపాలను ఆవిష్కరించారు. పసుపు, పిండి, కూరగాయలు, పేపర్, పసుపుతో విఘ్నేశుని ప్రతిరూపాన్ని ప్రతిబింబించి సృజనకు పదును పెట్టారు. ఉల్లంపర్రు మాంటిస్సోరి పాఠశాలలో బుధవారం ఈ ప్రతిమలను ప్రదర్శించి భళా అనిపించారు.

– పాలకొల్లు అర్బన్



పశ్చిమగోదావరి | గురువారం | ఆగస్టు | 24 | 2017 సాక్షి

ఇక వివరాలు పక్కా

- గ్రామ, మండల స్థాయిల్లో రికార్డులు
- కార్యదర్శులు, ఎంపీడీఓలు బాధ్యులే
- ఉపాధి హామీ పథకంలో కొత్త విధానాలు



ఏలూరు (మెట్రో) :

కోట్ల రూపాయలతో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, పర్యవేక్షణ కొరవడుతోంది. ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో రూ.కోట్లలో అక్రమాలు బయటపడుతున్నా వెలుగులోకి రానివి అనేకం ఉంటున్నాయి. దీనికి గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీ పనుల వివరాలు ఎవరికీ తెలియకపోవడమే కారణం. ఈ పథకం ద్వారా పనులు జరుగుతున్నా తమది కాదేంటే తమది కాదన్న రీతిలో మిగిలిన శాఖల అధికారులు, ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. పనులు పర్యవేక్షించాలిన్న ఎంపీడీఓలు సైతం క్షేత్రస్థాయి సిబ్బంది సిద్ధం చేసిన ఫైళ్లపై సంతకాలు చేయడానికే ఆసక్తి చూపిస్తున్నారు తప్ప వాస్తవాలు గుర్తించడం లేదు. ఇకపై ఆ పరిస్థితి లేకుండా గ్రామ, మండల స్థాయిలో ఉపాధి వివరాలు సమగ్రంగా రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ఉపాధి హామీ పనులకు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు విధిగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ఆయా గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలకు సంబంధించి ప్రత్యేక రికార్డులు తయారు చేయడంలో ఉపాధి సిబ్బంది సిద్ధమవుతున్నారు.

ఫిర్యాదులపై చర్యలకు ప్రత్యేకం

ఉపాధి పనులపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తుంటాయి. కూలి డబ్బులు రావడం లేదని, కొలతలు సక్రమంగా తీయడం లేదని, మస్టర్లు వేయడం లేదని, పనిచేసే చోట సదుపాయాలు కల్పించలేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తుంటాయి. వీటికి తోడు క్షేత్ర సహాయకుల అక్రమాలు, మస్టర్ల మాయా జాలంపైనా ఆరోపణలు వస్తుంటాయి. వీటిపై అధికారులు విచారణ జరిపి ఏం చర్యలు తీసుకున్నారనే వివరాలను తెలిపేలా ప్రత్యేక రికార్డును నిర్వహించాలి. ఇకపై గ్రామాల్లో ఉపాధి హామీలో చేసే పనులు, చేపట్టే పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శికి తెలిసే ఉండాలి. లేకుంటే కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. ఆ గ్రామంలో ఉపాధి పనులను విధిగా పరిశీలించి నివేదిక సమర్పించాలి. పథకంలో లోపాలు ఏం జరిగినా కార్యదర్శి, ఎంపీడీఓలను బాధ్యులను చేస్తారు.

నమోదు చేసే అంశాలు ఇవే

పనిచేసే వారి నివేదికను తయారు చేయాలి. ప్రతి పనికి సంబంధించి ఫొటోతో పాటు ఆ పని పూర్తి వివరాలు పొందుపరచాలి. పని ప్రతిపాదన మొదలు అంచనా తయారీ, ఆమోదం, మార్పులు, ఎంత మంది కూలీలు పాల్గొన్నది, మెటీరియల్ ఖర్చు, ఎవరు పర్యవేక్షించారు, ఏయే తేదీల మధ్య పనులు నిర్వహించారనే విషయాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలి. పుస్తకాల్లో రికార్డులు నిర్వహించడంతో పాటుగా కంప్యూటరీకరణ చేయాల్సి ఉంది. జాబ్‌కార్డుల వివరాలు, ఏయే పనులు చేయడానికి ఆసక్తి చూపుతున్నారనేది నమోదు చేయాలి. మండల స్థాయిలో రికార్డులు ఎంపీడీఓల ఆధ్వర్యంలో నిర్వహించాలి. కూలీల హాజరు, వారి వేతనాల చెల్లింపులు, ఆయా గ్రామాల్లో చేసిన పనుల నాణ్యతకు సంబంధించి వివరాలుండాలి. ఈ రికార్డులపై ప్రతి మూడు నెలలకు ఒక సారి ఉన్నతాధికారులు పరిశీలన ఉంటుంది. పనుల వివరాలను పనిచేసే ప్రదేశాల్లోనే ప్రదర్శించాలి. చెరువులు, సీసీ రహదారులు, శ్మశాన వాటికల అభివృద్ధి, చెక్‌డ్యాంలు వంటి వాటికి ఎంత ఖర్చు చేస్తున్నారు. ఎంత మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారు. అంచనా విలువ వంటి వివరాలను ప్రదర్శించాలి.

చేతి వృత్తిదారులకు సబ్‌ప్లాన్‌కు డిమాండ్

ఏలూరు (సెంట్రల్) : చేతి వృత్తిదారులకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తిదారులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ప్రపంచీకరణ నేపథ్యంలో చేతి వృత్తిదారుల కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మగ్గంపై తయారు కావాల్సిన వస్త్రాలు పవర్‌లూమ్ మిల్లులపై తయారవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని వివరించారు. వృత్తిదారుల రాయితీ రుణాల కోసం జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వస్తుందని ఆరోపించారు. సబ్‌ప్లాన్ ఏర్పాటు కోరుతూ సెప్టెంబర్ 11న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. నాయకులు పిచ్చుక ఆదిశేషు పాల్గొన్నారు.

కుటుంబీకులతో కార్మికుల నిరసన

- చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ వద్ద దీక్ష
- వైఎస్సార్ సీపీ, రైతు సంఘం, బాట్లింగ్ కంపెనీ కార్మికుల సంఘీభావం

చాగల్లు :

పది నెలలుగా జీతాల్లేవ్.. ఎలా బతికేది.. పిల్లల ఫీజులు ఎలా కట్టేదంటూ చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు కుటుంబాలతో సహా బుధవారం వినూత్న నిరసన తెలిపారు. వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద దీక్ష, అనంతరం మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీగా బయలుదేరి ప్రధాన కూడలి వద్ద మానవ హారం నిర్వహించారు.

చాగల్లు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ఎం.మెరికమ్మకు వినతిపత్రం అందించారు. కార్మికులకు రైతు సంఘం నాయకులు, బాట్లింగ్ కంపెనీ కార్మికులు మద్దతు పలికారు. వెంటనే వేతనాలను విడుదల చేయాలని ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మిక సంఘం అధ్యక్షుడు నీరుకొండ కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. దీక్షల్లో పీవీవీ రామారావు, కె.సోమరాజు, వీఏస్ రాంబాబు, ఎస్ఎల్‌వీ ప్రసాద్, సీహెచ్ రామ్మూర్తి, ఎంవీఎస్ఎస్ మోహనరావు, ఎస్.సత్యనారాయణ, ఆర్.సీతయ్య, కాశీ కుర్పున్నారు. యూనియన్ నాయకులు తూమురోతు చిన్నారావు, తాళ్లూరి శ్రీనివాసరావు, మాదాల శ్రీనివాసరావు, బొడ్డు వీర వెంకట తాతారావు, కొడవటి గంగరాజు, ఖండవిల్లి వెంకటాచార్యులు పాల్గొన్నారు.



కార్మికుల దీక్షలకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేత తానేటి వనిత తదితరులు

జీతాలు చెల్లించకపోతే ఉద్యమం ఉధృతం

షుగర్ ఫ్యాక్టరీ వద్ద కార్మికుల దీక్షకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కొవ్వూరు నియోజకవర్గ సమన్వయ కర్త తానేటి వనిత మాట్లాడారు. సీఎం చంద్రబాబు నంద్యాలలో మూతబడిన షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల హామీ ఇచ్చారని, చాగల్లులో ఫ్యాక్టరీ తెరవాలంటే ఇక్కడా ఉప ఎన్నికలు రావాలేమోనని ఎద్దేవా చేశారు. ఈ ఫ్యాక్టరీ మూతపడడంతో 10 వేల మంది రైతులు, 700 మంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా కార్మికుల సమస్య పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే జీతాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉచిత న్యాయ సాయం పొందండి

ఏలూరు (సెంట్రల్) : జిల్లాలో జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చాని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శైలజ తెలిపారు. బుధవారం ఆమె జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలకు అందుతోన్న వసతులపై ఆరా తీశారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోకుండా మంచి పౌరులుగా జీవించాలని ఖైదీలకు సూచించారు. రాజీ కాదగిన కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. జైలు సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్, న్యాయవాది కోనాల ఆమె వెంట ఉన్నారు.



ఖైదీల భోజనం పరిశీలిస్తున్న జడ్జి శైలజ

గృహ లబ్ధిదారుల జాబితా పంపించండి

ఏలూరు (మెట్రో): ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల తుది జాబితాను సెప్టెంబరు 15 నాటికి పంపాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. విజయవాడ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆధార్, రేషన్ కార్డుకు అనుసంధానం చేసి జాబితా వివరాలు సిద్ధం చేశామని చెప్పారు. బోగస్ డేటాను తొలగించి నివేదికను వెంటనే పంపిస్తామన్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఇ.శ్రీనివాస్, డీఎంహెచ్ఓ కె.కోటేశ్వరి, అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, సాయిబాబా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెద్దదిక్కును కోల్పోవడం బాధాకరం

మంత్రి పితాని సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్ :

కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోవడం బాధాకరమని కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ తండ్రి వెంకటేశ్వరరావు మృతి సంతాప సభ బుధవారం స్థానిక జయలక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పితాని మాట్లాడుతూ ఉన్నతాశయాలతో కుటుంబాన్ని నడిపించిన వ్యక్తి వెంకటేశ్వరరావు అని కొనియాడారు. వెంకటేశ్వరరావు ఆశయ సాధనకు కుటుంబ సభ్యులు కృషి చేయాలన్నారు. తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు నిర్మిస్తున్న సత్రాలను దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు సహకారంతో పూర్తి చేయాలని అన్నారు. తొలుత వెంకటేశ్వరరావు చిత్రపటానికి మంత్రి పితాని, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి ఘంటా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బొత్స సత్యనారాయణ, ఏలూరు డీఎస్పీ నర్రా వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ, ఉల్లి వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు గూడూరి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ దేవతి పద్మావతి, పెంటపాడు మాజీ ఎంపీపీ దాసరి హైమావతి, వైఎస్సార్ సీపీ కార్యదర్శి వలవల సూరిబాబు, మాజీ కౌన్సిలర్లు పత్సపట్ల సావిత్రి, గొర్రెల లక్ష్మీనర్సమ్మ, కొలుకులూరి ధర్మరాజు, న్యాయవాది మాకా శ్రీనివాస్, బీజేపీ నాయకులు పోతుల అన్నవరం, యెగ్గిన నాగబాబు, నరిశే సోమేశ్వరరావు, నాయకులు దుర్గా రామచంద్రరావు, ముద్రగడ లలితకుమారి పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు సంతాప సభలో పాల్గొన్న బొత్స సత్యనారాయణ

పెరిగిన ధర.. పొగాకు రైతుకు భరోసా

- చివర్లో పుంజుకున్న మార్కెట్
- కిలో ధర రూ.198
- సగటు ధర రూ.176
- పెరిగిన సాగు విస్తీర్ణం

దేవరపల్లి :

పొగాకు మార్కెట్ పరుగెడుతోంది. రైతులు ఊహించని విధంగా వేలం చివరి దశలో పుంజుకోవడంతో గరిష్ఠ, సగటు ధరలు పలుకుతున్నాయి. నాలుగేళ్లలో ఇటువంటి పరిస్థితి లేదని, దీంతో అప్పుల నుంచి గట్టెక్కవచ్చని రైతులు భావిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 15న పొగాకు కొనుగోళ్లు ప్రారంభించగా దాదాపు మూడు నెలలు మార్కెట్ మందకొడిగా జరిగింది. వేలంలో గిట్టుబాటు ధర రాక రైతులు పొగాకు అమ్మేందుకు ముందుకు రాలేదు. కౌలు, చిన్న రైతులు మాత్రమే పొగాకును అమ్మి సొమ్ము చేసుకున్నారు. పెద్ద రైతులు పొగాకును నిల్వచేశారు. జూలై నుంచి పొగాకు మార్కెట్ రోజురోజుకు పుంజుకుంటూ వస్తోంది. మే వరకు కిలో గరిష్ఠ ధర రూ.185 ఉండగా, జూన్ నుంచి ధరలు పెరగడం ప్రారంభమయ్యాయి. జూలై, ఆగస్టు నెలల్లో మార్కెట్‌లో ధరలు గణనీయంగా పెరిగాయి. కిలో గరిష్ఠ ధర



రూ.200 పలకడం, సగటు ధర రూ.180 దాటడంతో రైతుల్లో ఆనందం వెల్లువిరిసింది. ఈ ధర రెండు రోజులు మత్రమే పలికింది. అనంతరం వ్యాపారులు సిండికేట్‌గామారి రూ.185కు తగ్గించడంతో రైతులు కొనుగోళ్లను మూడు రోజులు నిలుపుదల చేశారు. ధర తగ్గింపుపై నిలదీశారు. ఇడియన్ టుబాకో అసోసియేషన్ (ఐటీఏ) జోక్యంతో రైతులు, కొనగోలు దారుల మధ్య ఏర్పడిన వివాధం సర్దుమణిగింది. అనంతరం మార్కెట్ రోజురోజుకు మెరుగుపడుతూ వచ్చింది. ప్రసుత్తం కిలో గరిష్ఠ ధర రూ.198, సగటు ధర రూ.176 పలుకుతోంది. సెప్టెంబర్ నెలాఖరు వరకు పొగాకు కొనుగోళ్లు జరిగే అవకాశం ఉంది.

34 మి.కి. పొగాకు విక్రయాలు

జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1,2 వేలం కేంద్రాల పరిధిలో ఈ ఏడాది 42 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఉండగా 44 మిలియన్ కిలోలు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు అంచనా. ఇప్పటి వరకు 34 మిలియన్ కిలోలు విక్రయాలు జరగ్గా, రైతుల వద్ద మరో 10 మిలియన్ కిలోలు ఉన్నట్లు చెబుతున్నారు. అధనంగా పండించిన రెండు మిలియన్ కిలోల పొగాకు పెనాల్టీ లేకుండా అమ్ముకోవడానికి అనుమతి ఇవ్వాలని రైతులు బోర్డు చైర్మన్‌కు, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి అర్జీలు అందజేశారు. ఇప్పటి వరకు ఎటువంటి అనుమతి రాకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు.

పెరిగిన కౌలు ధరలు

మార్కెట్ పుంజుకోవడంతో పొగాకు భూముల కౌలు ధర పెరిగింది. గతేడాది ఎకరం కౌలు రూ.22 వేలు ఉండగా, వచ్చే ఏడాది రూ.35 వేలు వరకు పలుకుతుందని రైతులు వాపోతున్నారు. కూలిరేట్లు కూడా పెరుగుతాయని చెబుతున్నారు. ముందుగా అమ్ముకున్న రైతులు కిలోకు సగటున రూ.30 వరకు నష్టపోయారు.

సందిగ్ధంలో చిన్నరైతులు

వచ్చే ఏడాది పొగాకు పంట సాగు చేయాలా? లేదా అనే సందిగ్ధంలో పలువురు రైతులు ఉన్నారు. మూడేళ్లుగా పొగాకుకు గిట్టుబాటు ధర లభించక నష్టపోయిన రైతులు జీడిమామిడి, ఆయిల్ ఫామ్, కొబ్బరి వంటి పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అధికారులు కూడా పొగాకు ప్రత్యామ్నాయంగా వేరొక పంటలు సాగుచేసుకోవాలని గ్రామాల్లో సదస్సుల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. అయితే వేలం చివర్లో పొగాకు మార్కెట్ పంజుకోవడంతో ప్రత్యామ్నాయ పంటలు వేయాలా, పొగాకు పండించాలా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు.

మార్కెట్ ధర బాగుంది

పొగాకు మార్కెట్ ధర బాగుంది. ఎకరాకు సగటున 9 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. గరిష్ఠ, సగటు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. తెలుపు రంగుకు రూ.198, ఆరెంజ్ రంగుకు రూ.185, లెమన్ రంగుకు రూ.196 లభిస్తుంది. రైతులకు చాల వరకు అప్పులు తీరతాయి.

– సత్తి జగదీశ్వరరెడ్డి, పొగాకు రైతు సంఘం ప్రతినిధి

మంచి ధర ఉంది

ఈ ఏడాది చివర్లో మంచి ధరలు లభిస్తున్నాయి. ముందుగా అమ్మకున్న రైతులు కొంత వరకు నష్టపోయారు. గ్రేడును బట్టి ధర పలుకుతుంది. దీని ప్రభావం కౌలు భూములపై పడింది. డిమాండ్, సప్లయ్‌లను బట్టి పొగాకు మార్కెట్ ఎప్పుడు ఏలా ఉంటుందో చెప్పలేం. అధనపు పొగాకు అమ్ముకోవడానికి త్వరలో అనుమతి వచ్చే అవకాశం ఉంది.

– కరుటూరి శ్రీనివాస్, రైతు సంఘం ప్రతినిధి

ఖరీఫ్‌లో విఫలమైన అధికారులపై చర్యలు

ఏలూరు (మెట్రో) :

ఖరీఫ్ పంటకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ రైతులను సమాయత్తం చేసే విషయంలో విఫలమైన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ప్రాధాన్యతా రంగాల ప్రగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ముందస్తుగా ఖరీఫ్ సాగులో భాగంగా వరినాట్లు జూలై 15కే పూర్తికావాల్సి ఉన్నా నేటికీ పనులు నిర్వహిస్తోన్న మండలాలకు చెందిన వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయాధికారులపై వెంటనే నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ జేడీని కలెక్టర్ ఆదేశించారు. సూక్ష్మసేద్యం మల్బరీ, కోకో, ఉద్యానవన పంటలకు సంబం.



ప్రాధాన్యతా రంగాల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ భాస్కర్

దించి నిర్ధేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందేనన్నారు. సమావేశంలో ఏజేసీ ఎంహెచ్ షరీఫ్, సీపీఓ బాలకృష్ణ, వ్యవసాయశాఖ జేడీ గౌసియా బేగం, వ్యవసాయశాఖ డీడీ షాజానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు పనిచేయండి

లక్ష్య సాధనకు పనులు వేగవంత చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ భాస్కర్ ఆదేశించారు. ఎన్టీఆర్ జలసిరి, ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్షించారు. జలసిరి–2లో మెట్ట ప్రాంతంలో కేటాయించిన బోర్ల నిర్మాణ పనులు సెప్టెంబర్ నెలాఖరునాటికి పూర్తి చేయాలన్నారు. నీరు చెట్టు పథకం పెండింగ్ పనులపై ఆరా తీశారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరమణ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో జాప్యం

జిల్లాలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయిన్ల పనులు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రతి సమావేశంలో పంచాయతీరాజ్ అధికారులకు చెబుతున్నప్పటికీ పనులు పూర్తికాకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం

జిల్లాలో పరిశ్రమల స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ భాస్కర్ తెలిపారు. కలెక్టరేట్లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. అర్హతగల యువతకు ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు అవగాహన కల్పించి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం త్రిమూర్తులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సాధనలో టంగుటూరి పాత్ర ఎనలేనిది

ఏలూరు (మెట్రో) :

దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంలో టంగుటూరి ప్రకాశం పంతులు పాత్ర ఎంతో ఉందని జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మద్రాస్‌లో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమం 1928లో పాల్గొని తుపాకీకి ఎదురు నిలిచి కాల్చమని





ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ భాస్కర్, డీపీఆర్వో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏడీ భాస్కర నరసింహం

సవాల్ విసిరిన ధీరోదాత్తుడు ప్రకాశం పంతులని కొనియాడారు. ఆంధ్రరాష్టానికి తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ఆ పదవికి వన్నెతీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలోడీఆర్వో కె.హైమావతి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

డీపీఆర్వో కార్యాలయంలో..

దేశ, రాష్ట్రాభివృద్ధికి టంగుటూరు చేసిన కృషి చిరస్మరణీయమని సమాచార అసిస్టెంట్ డైరెక్టర్ వి.భాస్కర నరసింహం అన్నారు. స్థానిక డీపీఆర్వో కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనలో ప్రకాశం నిర్ణాయకపాత్ర పోషించారన్నారు. జాతికి చేసిన సేవలు మరుపురానివన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో ఆర్వీఎస్ రామచంద్రరావు, ఏపీఆర్ఓ సీహెచ్ దుర్గాప్రసాద్ లింగం, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

46 మి.కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతి

దేవరపల్లి: జిల్లా మెట్ట ప్రాంతంలో వర్జీనియా (ఎన్ఎల్ఎస్) పొగాకు ఉత్పత్తి పరిమితి పెరిగింది. 2018–19 సంవత్సరానికి దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1,2 వేలం కేంద్రాల పరిధిలో 46 మిలియన్ కిలోల పొగాకు పండించి అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చినట్లు పొగాకు రైతు సమాఖ్య నాయకుడు కరుటూరి శ్రీను తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పొగాకు బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 42 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతుండగా, వచ్చే సీజన్‌లో అధనంగా 4 మిలియన్ కిలోలు పండించవచ్చని తెలిపారు. బ్యారన్‌కు 33 క్వింటాళ్లు పొగాకు రైతులు పండించి అమ్ముకోవచ్చునని ఆయన తెలిపారు. పంట ఉత్పత్తి పరిమాణాన్ని పెంచడానికి కృషి చేసిన ఎంపీలు మాగంటి బాబు, తోట సీతారామలక్ష్మిలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా నుంచి రైతు ప్రతినిధులు గద్దే శేషగిరిరావు, ఆచంట గోపాలకృష్ణ పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో నవ్యాంధ్ర నాటకోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో నవ్యాంధ్ర నాటకోత్సవాలు నిర్వహిస్థామని హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి పెదపాటి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచే హాలులో జరిగే ఈ ఉత్సవాల్లో ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో గెలుపొందిన ఉత్తమ నాటకాలు ప్రదర్శిస్తామన్నారు. 28న సాయంత్రం 5.30 గంటలకు ప్రమీలార్జున పరిణయం అనే పద్యనాటకం, రాత్రి 8 గంటలకు సంభవామి అనే నాటిక, 29న సాయంత్రం 5.30 గంటలకు తేనెటీగలు పగబడ్తాయ్, 7 గంటలకు జారుడు మెట్లు, రాత్రి 8.30 గంటలకు కాంట్రవర్సీ అనే నాటికలు ప్రదర్శిస్తామని వివరించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన నాటక రంగ అభిమానులు, ప్రోత్సాహకులు పాల్గొనాలని కోరారు.

గిరిజన దర్బార్‌లో 73 అర్జీలు

బుట్టాయగూడెం : మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యల పరిష్కారం కోసం 73 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో పాల్గొన్న జేసీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కె.కోటేశ్వరరావుకి వేలేరుపాడు, కుక్కునూరు,పోలవరం, బుట్టాయగూడెం మండలాల్లో నెలకొన్న సమస్యలపై గిరిజనులు వినతిపత్రాలను అందించారు. పోలవరానికి చెందిన బురగం శ్రీను, ఎం.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఏపీవో పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులను, జన్మభూమిని మరువకూడదు



కోడేరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీకార్డుల పంపిణీ

ఆచంట : జన్మభూమిని, చదువుకున్న విద్యాలయాన్ని, గురువులను ఎప్పటికీ మర్చి పోకూడదని కోడేరు సర్పంచ్ పెచ్చెట్టి సత్యనారాయణ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. కోడేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి సరిపల్లి శ్రీదేవి బుధవారం పాఠశాలలోని విద్యార్థులకు టై, బెల్టు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. దాతను సర్పంచ్ అభినందించారు. కొడమంచిలి గ్రామానికి చెందిన చిక్కాల సూర్యనారాయణ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభావంతులకు బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సరెళ్ల శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు పెచ్చెట్టి సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్య తనిఖీలు తప్పనిసరిగా చేయించాలి



పర్యావరణ ప్రమాణ పత్రాలు అందుకుంటున్న అధ్యాపకులు

పెనుగొండ : వాహనాలు వెదజల్లే కాలుష్యాన్ని నియంత్రించడానికి రవాణా శాఖ అనుమతి పొందిన సంచార వాహన కాలుష్య తనిఖీ కేంద్రాల్లో యజమానులు తమ వాహనాలను విధిగా తనిఖీలు చేయించుకోవాలని ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపాల్ నడింపల్లి సూర్య నారాయణ రాజు కోరారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం వాహన కాలుష్య నివారణకు తనిఖీలు నిర్వహించారు. 32 మంది వాహన యజమానులకు తనిఖీల అనంతరం పర్యావరణ ప్రమాణ పత్రాలను అందజేశారు.

సైకిల్ షెడ్లు లేక విద్యార్థుల అవస్థలు



ఆచంట వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆరుబయటే సైకిళ్లు పార్కింగ్ చేసిన విద్యార్థులు

ఆచంట : ఆచంట వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో సైకిల్ షెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 330 మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలలో సమీప ప్రాంతాల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు సైకిళ్లపై వస్తూంటారు. సైకిళ్ల పార్కింగ్‌కు స్కూల్‌లో వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలోనే సైకిళ్లు నిలుపుకోవలసి వస్తోంది. సైకిళ్లు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. రాజీవ్ విద్యామిషన్ నిధులతో పాఠశాల్లో సైకిల్ షెడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీవన ఎరువులు వినియోగించండి

రైతులకు ఏడీఏ రమేష్ సూచన



చిన్నంవారిపాలెంలో చంద్రన్న రైతు క్షేత్రం శిక్షణ కార్యక్రమం

పెనుగొండ : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ, జీవన ఎరువుల వినియోగించటం రైతులు అలవాటు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎంవీ రమేష్ కోరారు. పెనుగొండ మండలం చిన్నంవారిపాలెంలో బుధవారం నిర్వహించిన చంద్రన్న రైతు క్షేత్రం–శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. దీనిని రైతులకు అలవాటు చేయడానికి 10 హెక్టార్ల విస్తీర్ణాన్ని ఎంపిక చేశామన్నారు. భూసార పరీక్షల నివేదిక మేరకు ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. సస్యరక్షణకుగాను వేప నూనె, సుడోమోనాస్, ట్రైకోగామ కార్డ్స్ వంటి సేంద్రియ, జీవ శిలీంధ్ర నాశనులను వినియోగిస్తూ రసాయన పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. పొలం పరిసరాలను క్రమంగా పరిశీలిస్తూ శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తిని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటపై కాండం తొలుచు పురుగు, ఆకుముడత, నల్లి, పొడ తెగులు ఉధృతి ఎక్కువ ఉందన్నారు. రైతులందరూ యూరియా వినియోగం తగ్గించాలన్నారు. పొలం గట్లు కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మొవ్వు పురుగు, ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ ఎకరానికి 300 గ్రాములు, నల్లి నివారణకు ప్రోపినోఫాస్ ఎకరాకు 400 మిల్లీలీటర్లు, పొడతెగులు నివారణకు హెక్సాకొనజోల్ ఎకరానికి 400 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని సూచించారు. తామరాడ, దేవ, ములపర్రులో సమూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు ఏఈఓలు కె.పావని, వి.భానుప్రకాశ్, ఎంపీఈఓలు కె.జ్యోతి, ఎం.రాజ్‌కుమార్, పి.సురేంద్రకుమార్, ఎంఎ సతీష్, ఎ.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయం



పెనుమంట్ర మండలం వనంపల్లిలో టంగుటూరి జయంతి వేడుక



పెనుగొండ ఎస్వీకేపీ కాలేజీలో ప్రకాశంకు నివాళులు

పెనుగొండ : విద్యార్థులు ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ నడింపల్లి సూర్యనారాయణ రాజు అన్నారు. ప్రకాశం జయంతిని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డీవీఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన ఆయన తిరుపతిలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపన, కృష్ణానదిపై బ్యారేజీ నిర్మాణం, విద్య, నీటి పారుదల రంగాల ప్రగతికి ఎంతగానో కృషి చేసారన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి కేవీ సురేష్‌బాబు, అధ్యాపకులు సీఎస్ ఆనంద్‌కుమార్, జి.శ్రీధర్, ఆర్.రామ్మోహనరావు, కార్యాలయ ఇన్‌చార్జి పి.వెంకన్న, ఎస్.సూర్యనారాయణ, ఎన్.అనిల్ కుమార్, ఎంవీఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్.ముత్యాలరావు పాల్గొన్నారు.

టంగుటూరిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆచంట : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పతులు ధైర్యసాహసాలను యవత స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడవాలని ఎంపీపీ మేకా పద్మకుమారి అన్నారు. బుధవారం ఆయన జయంతి వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, కార్యాలయ సూపరింటెండెంట్ గుబ్బల శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథరావు పాల్గొన్నారు .

ఘనంగా టంగుటూరి జయంతి

పెనుగొండ : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పెనుమంట మండలం వనంపల్లి, పంచగ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం, మానవత స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచగ్రామ బ్రాహ్మణ సంఘం సభ్యులు విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. విద్యార్థి స్కూల్ విద్యార్థులకు ప్రకాశం పంతులు జీవిత విశేషాలను వివరించారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు తోలేటి రాంబాబు, జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులు చెట్లపల్లి ప్రసాద్, మానవత జిల్లా కార్యవర్గ సభ్యుడు కొత్త సత్యనారాయణమూర్తి, మానవత చైర్మన్ కర్రి వేణుబాబు, మండల అధ్యక్షుడు వెలగల నారాయణ రెడ్డి, విద్యార్థి స్కూల్ డైరెక్టర్లు పడాల వెంకటరెడ్డి, సుధారాణి, హెచ్ఎం పి. శివనాగేశ్వర్ పాల్గొన్నారు.

బోదెలోకి దూసుకెళ్లిన లారీ



జగన్నాథపురం వద్ద బోదెలోకి దూసుకెళ్లిన లారీ

పోడూరు : పాలకొల్లు–మార్టేరు రోడ్డులో జగన్నాథపురం వద్ద బుధవారం క్వారీ లారీ అదుపు తప్పి పక్కనున్న పంట బోదెలోకి దూసుకెళ్లింది. లారీ డ్రైవర్, క్లీనర్ అదృష్టవశాత్తు ఈ ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ పాలకొల్లు వైపు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో అటువైపు ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది.

నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి



ఆచంటలో నిర్వహించిన బీజేవైఎం సమావేశం

ఆచంట : నవభారత నిర్మాణంలో యువతీ యువకులను భాగస్వాములను చేయడంలో భారతీయ జనతా యువ మోర్చా కార్యకర్తలు ప్రముఖ పాత్ర పోషించాలని బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉన్నమట్ల కపర్ధీ కోరారు. బుధవారం స్థానిక రామేశ్వర స్వామి సత్రంలో బీజేవైఎం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి వేండ్ర కొండలరావు అధ్యక్షతన జరిగింది. కపర్ధీ మాట్లాడుతూ ఈనెల 28న విజయవాడలో నిర్వహించే యువమోర్చ కార్యాక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముచ్చెర్ల నాగ సుబ్బారావు, ఏడిద కోడంద చక్రపాణి, సీనియర్ నాయకులు గంటా హనుమంతరావు, మన్నె ప్రసాదు, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల అధ్యక్షులు కడలి రాజా, టి.రత్నారెడ్డి, చిట్టి మణికంఠ పాల్గొన్నారు.

వెండితెర



ఆచంట	
కల్యాణచక్రవర్తి	: నేనే రాజు నేనే మంత్రి
పెనుగొండ	
మినర్వా	: జయ జానకి నాయక
వల్లూరు	
విజయకృష్ణ	: జయ జానకి నాయక
పాలకొల్లు	
గీతా అన్నపూర్ణ	: నేనే రాజు నేనే మంత్రి
మారుతి	: లై
దాసరి మినీ	: దువ్వాడ జగన్నాధం
శ్రీనివాస డీలక్స్	: జయ జానకి నాయక
శ్రీనివాస మినీ	: నిన్ను కోరి
శ్రీనివాస డీటీఎస్	: గ్రీన్‌కార్డు
రంజని	: దర్శకుడు
తణుకు	
శ్రీలక్ష్మి	: జయ జానకి నాయక
మినీ లక్ష్మి	: లై
నరేంద్ర	: నేనేరాజు నేనే మంత్రి
మినీ నరేంద్ర	: శమంతకమణి
వెంకటేశ్వర	: ఆనందో బ్రహ్మ
ప్రత్యూష	: ఫిదా, దర్శకుడు
శ్రీ చిత్ర	: అనబెల్

ప్లాటినం నిరోధక థర్మామీటర్ విలువ?



ఎం. సైదులు
సబ్జెక్టు నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజికల్ సైన్స్
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. థర్మామీటర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
1) సెల్సియస్ 2) ఫారన్‌హీట్
3) కెల్విన్ 4) గెలీలియో

2. ఉష్ణోగ్రతకు S.I. ప్రమాణం ఏది?
1) కెల్విన్ 2) సెల్సియస్
3) ఫారన్‌హీట్ 4) జౌల్

3. సెల్సియస్ స్కేల్‌లో 0°C సరిసమాన విలువ కెల్విన్ స్కేల్‌లో?
1) 273k 2) 273.15k
3) 275.15k 4) 270k

4. సెల్సియస్ స్కేల్, ఫారన్‌హీట్ స్కేల్‌లు ఏ ఉష్ణోగ్రత వద్ద సమానంగా ఉంటాయి?
1) 4° 2) –4° 3) 40° 4) –40°

5. ద్రవ థర్మామీటర్‌ల కంటే వాయు థర్మామీటర్‌లు సున్నితత్వాన్ని కలిగి ఉంటాయి. కారణం?
1) వాయువులు స్వల్ప విశిష్టోష్ణం కలిగి ఉంటాయి
2) వాయువులు అధిక విశిష్టోష్ణం కలిగి ఉంటాయి
3) వాయువులు అధిక వ్యాకోచ గుణకం కలిగి ఉంటాయి
4) వాయువులు తేలికగా ఉంటాయి

6. సెల్సియస్ స్కేల్ ఉష్ణోగ్రతలో వ్యత్యాసం 25°C అయితే, ఫారన్‌హీట్ స్కేల్‌లో ఉష్ణోగ్రత వ్యత్యాసం ఎంత?
1) 25°F 2) 45°F
3) 60°F 4) 70°F

7. సెల్సియస్ స్కేల్ ఉష్ణోగ్రత విలువ 25°C అయితే ఫారన్‌హీట్ స్కేల్‌లో సూచించే ఉష్ణోగ్రత ఎంత?
1) 25°F 2) 45°F
3) 67°F 4) 77°F

8. సెల్సియస్ స్కేల్‌లో పరమ శూన్య ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) –200°C 2) –273.15°C
3) –373.15°C 4) –32°C

9. ఒక థర్మామీటర్‌లో నీటి ఘనీభవన, బాష్పీభవన స్థానాలు వరుసగా 20°C, 150°C. సెల్సియస్ స్కేల్‌లో 60°C ఇస్తే థర్మామీటర్‌లో సమానమైన విలువ ఎంత?
1) 110° 2) 88°
3) 78° 4) 60°

10. ప్లాటినం నిరోధక థర్మామీటర్ విలువ?
1) –200°C నుంచి 1600°C
2) –200°C నుంచి 1200°C
3) –200°C నుంచి 800°C
4) –0°C నుంచి 1200°C

11. 400°C క్రమంలో ఉష్ణోగ్రతలు కొలవడానికి ఉపయోగించే థర్మామీటర్ ఏది?
1) పాదరస థర్మామీటర్
2) ఆల్కహాల్ థర్మామీటర్
3) రేడియేషన్ థర్మామీటర్
4) థర్మోకపుల్ (ఉష్ణయుగ్మ) థర్మామీటర్

12. పాదరస థర్మామీటర్‌ను ఉపయోగించి కొలవగలిగే ఉష్ణోగ్రత విలువ?
1) 260°C 2) 100°C
3) 360°C 4) 500°C

13. ఒక వస్తువు ఉష్ణోగ్రతలోని వ్యత్యాసం – 50°C అయితే, కెల్విన్ స్కేల్‌లో ఉష్ణోగ్రతలోని వ్యత్యాసం?
1) 50K 2) 60K
3) 70K 4) 323K

14. ఉష్ణ వికిరణ తీవ్రతను కొలవడానికి ఉపయుక్తకరమైన పరికరం?
1) స్థిర ఘనపరిమాణ వాయు థర్మామీటర్
2) ద్రవ థర్మామీటర్
3) థర్మోపైల్ 4) పైవేవీకావు

15. సూర్యుడి ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగపడే పరికరం?
1) ప్లాటినం థర్మామీటర్
2) పైరోమీటర్
3) వాయు థర్మామీటర్
4) ఆవిరి పీడన థర్మామీటర్

16. కింది వాటిలో సరైన వాక్యాలు ఏవి?
ఎ) సెల్సియస్ స్కేల్‌లో స్థిర బిందువుల మధ్య విభాగాల సంఖ్య 100
బి) ఫారన్‌హీట్ స్కేల్‌లో స్థిర బిందువుల మధ్య విభాగాల సంఖ్య 180
సి) కెల్విన్ స్కేల్‌లో స్థిర బిందువుల మధ్య విభాగాల సంఖ్య 100
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

17. మానవుని శరీర ఉష్ణోగ్రత?
1) 37°F, 98.4°K, 310°C
2) 37°F, 98.4°C, 98.4°K
3) 37°C, 98.4°K, 310°F
4) 37°C, 98.4°F, 310°K

18. ఉష్ణశక్తికి S.I. ప్రమాణం ఏది?
1) కెలోరీ 2) జౌల్
3) కిలోకెలరీ 4) కెల్విన్

19. ప్రమాణ ద్రవ్యరాశి ఉన్న ఒక పదార్థం ఉష్ణోగ్రతను 1°Cకు పెంచడానికి కావలసిన ఉష్ణశక్తిని ఏమంటారు?
1) విశిష్టోష్ణం
2) మొత్తం శక్తి 3) గుప్తోష్ణం
4) ద్రవీభవన గుప్తోష్ణం

20. సెల్సియస్ స్కేల్‌లో ఉష్ణోగ్రతలో వ్యత్యాసం 10°C అయితే, ఫారన్‌హీట్ స్కేల్‌లో ఉష్ణోగ్రతలోని వ్యత్యాసం?
1) 18°F 2) 21°F
3) 10°F 4) 15°F

21. కింది వాటిలో సరైంది ఏది?
1) $\alpha : \beta : \gamma = 1 : 3 : 2$
2) $\alpha : \beta : \gamma = 3 : 2 : 1$
3) $\alpha : \beta : \gamma = 2 : 3 : 1$
4) $\alpha : \beta : \gamma = 1 : 2 : 3$

22. ఒక వృత్తాకార రాగి బిళ్ల మధ్య భాగంలో రంధ్రం చేశారు. ఈ రాగి బిళ్లను వేడి చేస్తే రంధ్రం వ్యాసం ఏమవుతుంది?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మార్పు ఉండదు
4) పైవేవీకాదు

23. కింది వాటిలో అత్యధిక విశిష్టోష్ణం ఉన్న పదార్థం ఏది?
1) ఇనుము 2) నీరు
3) రాగి 4) పాదరసం

24. గుప్తోష్ణం ప్రమాణం ఏది?
1) cal–gr 2) cal/°c
3) cal/gr 4) పైవేవీకావు

25. కెలోరి మీటర్‌ను సాధారణంగా దేనితో తయారు చేస్తారు?
1) రాగి 2) ఇత్తడి
3) అల్యూమీనియం 4) జింక్

26. 1 Cal = ?
1) 4186 J 2) 418.6 J
3) 41.86 J 4) 4.186 J

27. 1 Joule = ?
1) 0.28 Cal 2) 0.32Cal
3) 0.24 Cal 4) 4.2 Cal

28. అత్యధిక ఉష్ణోగ్రతలు కొలవడానికి ఉపయోగించే సాధనం?
1) పైరోమీటర్ 2) థర్మామీటర్
3) బోలోమీటర్ 4) కెలోరీమీటర్

29. కింది వాటిలో ఏ ద్రవ పదార్థాన్ని 4°C నుంచి 0°Cకు చల్లార్చినప్పుడు సంకోచానికి బదులుగా వ్యాకోచిస్తుంది?
1) ఆల్కహాల్ 2) నీరు
3) పాదరసం 4) నూనె

30. నీటిని 0°C నుంచి 10°C వరకు వేడి చేస్తే, దాని ఘనపరిమాణం?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మొదట పెరిగి తర్వాత తగ్గుతుంది
4) మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది

31. ఒక వాయువు సమోష్ణోగ్రతా ప్రక్రియలో స్థిరంగా ఉన్న భౌతిక అంశం ఏది?
1) పీడనం 2) ఉష్ణోగ్రత
3) సాంద్రత 4) 1, 3

32. మంచు ద్రవీభవన స్థానం..?
1) పీడనానికి అనులోమానుపాతంలో ఉంటుంది
2) పీడనానికి విలోమానుపాతంలో ఉంటుంది
3) ఎలాంటి మార్పు ఉండదు
4) పైవేవీ కాదు

33. ప్రెషర్ కుక్కర్‌లో ఆహార పదార్థాలు తొందరగా ఉడుకుతాయి. కారణం?
1) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం పెరగడం వల్ల నీటి మరిగే స్థానం కూడా పెరుగుతుంది
2) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం పెరగడం వల్ల నీటి మరిగే స్థానం తగ్గుతుంది
3) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం తగ్గడం వల్ల నీరు మరిగే స్థానం పెరుగుతుంది
4) ప్రెషర్ కుక్కర్‌లో పీడనం తగ్గడం వల్ల నీటి మరిగే స్థానం తగ్గుతుంది

34. ఎత్తైన ప్రదేశాల వద్ద ఆహార పదార్థాలు ఉడికించడం కష్టతరం. కారణం?
1) గాలిలో ఆక్సిజన్ తక్కువగా ఉండటం
2) అధిక ఉష్ణశక్తిని అందించడం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం
3) వాతావరణంలో పీడనం తగ్గడం వల్ల మరిగే స్థానం కూడా తగ్గిపోవడం
4) అధిక తేమ కలిగి ఉండటం

35. కింది వాటిలో ఆహార పదార్థాలు ఉడకడానికి అధిక సమయం పట్టే ప్రదేశం?
1) సముద్రమట్టం వద్ద
2) సిమ్లా వద్ద 3) ఎవరెస్ట్ శిఖరం వద్ద
4) ప్రెషర్ కుక్కర్‌లో

36. పరిపూర్ణ కృష్ణ వస్తువు శోషణ సామర్థ్యం విలువ?
1) 1 2) 0
3) అనంతం 4) –1

37. ఒక వస్తువు ఉష్ణోగ్రత 85°C నుంచి 80°C వరకు తగ్గడానికి పట్టే కాలం 5 నిమిషాలు. ఆ వస్తువు 80°C నుంచి 75°Cకు తగ్గడానికి పట్టేకాలం సుమారుగా?
1) 5 నిమిషాల కంటే తక్కువ
2) 5 నిమిషాల కంటే ఎక్కువ
3) 5 నిమిషాలు 4) పైవేవీకావు

38. 30°C వద్ద వాతావరణంలో ఒక వస్తువు 60°C నుంచి 50°C కు చల్లారడానికి 10 నిమిషాలు పట్టింది. 10 నిమిషాల తర్వాత 50°C వద్ద అదే వస్తువు ఉష్ణోగ్రత సుమారుగా?
1) 40°C కంటే తక్కువ
2) 40°C కంటే ఎక్కువ
3) 40°C 4) చెప్పలేం

39. ఉన్ని వస్త్రాలు శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తాయి. కారణం?
1) ఉన్ని.. శరీరంలో ఉష్ణోగ్రతను పెంచుతుంది
2) ఉన్ని అథమ ఉష్ణవాహకం, కాబట్టి శరీరం నుంచి ఉష్ణాన్ని ప్రసారం చేయనీయదు
3) పరిసరాల నుంచి వచ్చే వికిరణ శక్తిని ఉన్ని శోషించుకుంటుంది
4) పరిసరాల నుంచి వచ్చే వికిరణ శక్తిని వ్యతిరేకిస్తుంది

40. కింది వాటిలో ఉష్ణశోషణం లేదా ఉష్ణ ఉద్గారం జరగని ప్రక్రియ?
1) సమ ఘనపరిమాణ
2) సమపీడన 3) సమోష్ణోగ్రత
4) స్థిరోష్ణక

41. కణాల కదలిక వల్ల జరిగే ఉష్ణప్రసారాన్ని ఏమంటారు?
1) ఉష్ణ వహనం 2) ఉష్ణ సంవహనం
3) ఉష్ణ వికిరణం 4) తరంగ చలనం

42. భూమి వేడెక్కడం అనేది ఏ ప్రక్రియకు సంబంధించింది?
1) ఉష్ణ వహనం 2) ఉష్ణ సంవహనం
3) ఉష్ణ వికిరణం 4) పైవన్నీ

43. థర్మాస్ ఫ్లాస్క్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
1) ఆర్కిమెడీస్ 2) ఆల్బర్ట్ ఐన్‌స్టీన్
3) న్యూటన్ 4) జేమ్స్ డీవార్

44. థర్మాస్ ఫ్లాస్క్‌ను బాగా కుదిపితే దానిలో ఉన్న ద్రవం ఉష్ణోగ్రత ఏమవుతుంది?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మార్పు చెందదు
4) ద్రవ స్వభావంపై ఆధారపడి ఉంటుంది

45. వాహనాల్లోని రేడియేటర్‌లో నీటిని శీతలకారిణిగా ఉపయోగిస్తారు. ఎందుకు?
1) స్వల్ప సాంద్రత కలిగి ఉంటుంది
2) అధిక బాష్పీభవన స్థానం కలిగి ఉంటుంది
3) అధిక విశిష్టోష్ణం కలిగి ఉంటుంది
4) సులభంగా లభ్యమవుతుంది

46. ఒక తెల్లని, నునుపు తలం లక్షణం ఏది?
1) ఉత్తమ శోషణం, అథమ పరావర్తనం
2) అథమ శోషణం, అథమ పరావర్తనం
3) ఉత్తమ శోషణం, ఉత్తమ పరావర్తనం
4) అథమ శోషణం, ఉత్తమ పరావర్తనం

47. నీటిని 10°C నుంచి 0°C వరకు చల్లార్చితే, దాని ఘనపరిమాణంలో కలిగే మార్పు?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
4) మొదట తగ్గి, తర్వాత పెరుగుతుంది

48. ఒక పదార్థం ఘనస్థితి నుంచి నేరుగా వాయు స్థితికి మారే ప్రక్రియను ఏమంటారు?
1) ఘనీభవనం 2) నిక్షేపణం
3) ఉత్పతనం 4) ద్రవీభవనం

49. కింది వాటిలో అత్యుత్తమ ఉష్ణవాహకం ఏది?
1) పాదరసం 2) వెండి
3) బెంజీన్ 4) ఇనుము

50. కింది వాటిలో అత్యుత్తమ ఉష్ణ బంధకం ఏది?
1) వెండి 2) చెక్క
3) మానవుని శరీరం 4) వజ్రం

51. శీతాకాలంలో చేతి పంపు గొట్టాల ద్వారా వచ్చే నీరు వెచ్చగా అనిపిస్తుంది. కారణం?
1) మన శరీరం చల్లగా ఉండటం
2) వాతావరణంలో ఉన్న ఉష్ణశక్తిని నీరు గ్రహించడం వల్ల
3) భూమి లోపల ఉష్ణోగ్రతలు బయటి వాతావరణంలో ఎంటే ఎక్కువగా ఉండటం
4) పైవన్నీ

52. రాత్రివేళలో ఎడారి ప్రదేశాలు భూ ఉపరితలంపై కంటే చల్లగా ఉంటాయి. కారణం?
1) ఇసుక, భూ ఉపరితలం కంటే వేగంగా ఉష్ణ ఉద్గారం చేస్తుంది
2) ఇసుక, భూ ఉపరితలం కంటే వేగంగా ఉష్ణశోషణం చేసుకుంటుంది
3) ఇసుక ఎల్లప్పుడూ చల్లగానే ఉంటుంది
4) 1, 2

53. ఉష్ణోగ్రత పెరిగితే కాంతి వేగం..?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మార్పు చెందదు 4) చెప్పలేం

54. కింది వాటిలో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
1) ఆల్కహాల్ 2) పాదరసం
3) ఈథర్ 4) నీరు

సమాధానాలు

1) 4	2) 1	3) 2	4) 4	5) 1
6) 2	7) 4	8) 2	9) 3	10) 2
11) 4	12) 3	13) 1	14) 3	15) 2
16) 4	17) 4	18) 2	19) 1	20) 1
21) 4	22) 1	23) 2	24) 3	25) 1
26) 4	27) 3	28) 1	29) 2	30) 4
31) 2	32) 2	33) 1	34) 3	35) 3
36) 1	37) 2	38) 2	39) 2	40) 4
41) 2	42) 4	43) 4	44) 1	45) 3
46) 4	47) 4	48) 3	49) 2	50) 4
51) 3	52) 1	53) 3	54) 2	

What is the profession of W?



K.M. Jaya Rao
Subject Expert, Hyderabad.

Model Questions

Directions (Q.No.1-6): Read the following information carefully and answer the questions that follow.

There are eight friends P, Q, R, S, T, U, V and W who live in the same locality in a metropolitan city. Each person pursues a different profession - Author, Lawyer, Doctor, Engineer, Choreographer, Auditor, Professor & Teacher - but not necessarily in the same order. Each person is adept at playing different musical instruments - Flute, Guitar, Harmonium, Saxophone, Sitar, Tabla, Trumpet and Violin - butnot necessarily in the same order.

i) P, who plays tabla, is neither a Choreographer nor a professor, whereas Q is a Lawyer and plays violin. Engineer plays flute. R plays neither guitar nor flute. S does not play harmonium.

ii) Author plays saxophone. The lady who plays guitar is a renowned doctor.

iii) One who plays harmonium is a teacher whereas T and U play trumpet and saxophone respectively. Neither S nor V is an Engineer nor they play Sitar.

iv) R is neither a Choreographer nor an Auditor.

1. Who among the following is a Teacher?
1) Data inadequate
2) V 3) W 4) R
5) None of these

2. What is the profession of W?
1) Data inadequate
2) Teacher 3) Engineer
4) Professor 5) None of these

3. One who plays tabla is:
1) Auditor 2) Lawyer
3) Choreographer 4) Teacher 5) None of these

4. Which of the following pairs represents the person associated with harmonium and flute respectively?
1) W and V 2) V and W
3) P and R 4) Data inadequate
5) None of these

5. Which of the following is correctly matched?

Person	Instrument	Profession
1) R	Guitar	Professor
2) S	Sitar	Doctor
3) T	Trumpet	Author
4) U	Saxophone	Choreographer

5) None of these

6. Who among the following is Professor?
1) T 2) V 3) W
4) R 5) None of these

Directions (Q.No.7-12): Read the following information fully and answer the questions given below.

Ten friends R, S, T, U, V, M, N, O, P and Q are sitting in two opposite rows, facing each other. Each row has five persons.

- S, who is immediate left of U, is opposite to Q.
- T and N are diagonally opposite to each other.
- V, facing south, is opposite to O who is just next right of M.
- N is immediate right of Q.
- M is at one end of the line.
- P is exactly between N and M in a row.

7. Who is sitting immediate right of O?
1) Q 2) N 3) M
4) P 5) Data inadequate

8. If R shifts to the place of V, V shifts to the place of N, and N shifts to the place of R, then who will be the third to the left of the person opposite to O?
1) Q 2) P 3) V
4) U 5) N

9. Which of the following pair is diagonally opposite to each other?



1) VQ 2) SO 3) RN
4) RM 5) SQ

10. Who is third to the right of S?
1) U 2) T 3) V
4) O 5) M

11. In the original arrangement who is sitting just opposite to N?
1) S 2) R 3) T
4) U 5) V

12. In which of the following combinations is the second person sitting second to the left of the first person?
1) SR 2) NP 3) TV
4) OP 5) RV

Direction (Q.No.13-15): Study the following information to answer the given questions.

In a family of six persons, there are two couples.
The Lawyer is the head of the family and has only two sons - Mukesh and Rakesh - both teachers. Mrs. Reena and her mother-in-law both are Lawyers
Mukesh Wife is a Doctor and they have a son, Ajay.

13. Which of the following is definitely a couple?
1) Lawyer - Teacher
2) Doctor - Lawyer
3) Teacher - Teacher
4) Can't be determined
5) None of these

14. What is the profession of Rakesh's wife?
1) Teacher 2) Doctor 3) Lawyer
4) Can't be determined
5) None of these

15. How many male members are there in the family?
1) Two 2) Three 3) Four
4) Can't be determined
5) None of these

Directions (Q.No.16-20): In each of the questions below, a group of letters is followed by four combinations of digit symbol coded letters, (16), (17), (18), (19) and (20). You have to find out which of the combinations correctly represents the group of letters based on the following digit symbol code and combinations that follow, based on the given conditions.

Letters	P	M	R	E	T	A	H	I	N	J	U	B	K	O
Digits/ Symbols	2	9	%	1	#	8	6	@	3	©	7	4	$	5

Conditions:

i) If the first letter is a consonant and the last letter is a vowel, both are to be coded as Δ

ii) If the first letter is a vowel and the last letter is a consonant both are to be coded as δ

iii) If the first letter as well as last letter is a vowel, then their codes are to be interchanged.

iv) If the first letter as well as the last letter, and the second letter as well as the last but one letter are consonants then the codes for the first letter and the last letter are to be interchanged.

16. EPHABL
1) δ82648 δ 2) δ24688 δ
3) δ26488 δ 4) δ28648 δ
5) δ26848 δ

17. JMEUON
1) 39175© 2) ©17953
3) ©97153 4) ©91753
5) None of these

18. BTJAPK
1) 4#©82$ 2) $#©284
3) $#©824 4) $2©8#4
5) None of these

19. ARKHBU
1) 7 % 6 $ 4 8 2) 7 % $ 6 4 8
3) 8 % $ 6 4 7 4) 7 $ % 6 4 8
5) None of these

20. MTRABU
1) Δ#%84Δ 2) Δ#%48Δ
3) 9#%84Δ 4) Δ#%847
5) None of these

Directions (Q.No.21-22): Each of the questions are below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and Give answer:

1) If the data in statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question
2) If the data in statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone is sufficient to answer the question.
4) If the data in both the statements I and II together are not sufficient to answer the question
5) If the data in both the statements I and II together are necessary to answer the question.

21. On which day was Yasir born? (His date of birth is February 29)
I. He was born between year 2005 and 2011
II. He will complete 4 years on February 29, 2012

22. Out of 64 students 38 play both chess and cricket. How many students play only chess?
I. Out of 64 students, 22 students play any game. 4 students play only cricket.
II. Out of 64 students, 20 are girls and 10 of them don't play any game.

Directions (Q.No. 23-25): Read the following information/ statement carefully and answer the questions.

23. Which of the following expressions follows if the given expression 'A < C ≥ B = D ≤ E' is definitely true?
1) A ≤ D 2) E = C 3) D > C
4) E < B 5) None

24. In which of the following expressions will the expression 'L > P' be definitely false?
1) L > M ≥ N = P
2) P = N ≥ L > M
3) P ≤ M ≤ N < L
4) L > M = N ≥ P
5) All are false

25. Which of the following symbols should be placed in the blank spaces respectively (in the same orderfrom left to right) in order to complete the given expression in such a manner that 'V > Z' definitelyholds true?
V _ W _ X _ Z
1) <, ≤, = 2) >, ≥, <
3) =, <, ≤ 4) >, ≥, >
5) None of these

Key with Explanations

(1-6):

P	Auditor	Tabla
Q	Lawyer	Violin
R	Professor	Sitar
S	Doctor	Guitar
T	Choreographer	Trumpet
U	Author	Saxophone
V	Teacher	Harmonium
W	Engineer	Flute


1) 2 2) 3 3) 1
4) 2 5) 5 6) 4

(7-12):

T	V	U	S	R
↑	↑	↑	↑	↑
M	O	P	Q	N

7) 4 8) 5 9) 4
10) 2 11) 2 12) 2

(13-15):



13) 1 14) 3 15) 2 16) 5
17) 4 18) 3 19) 2 20) 1

(21-22):

21) 3; Yasir was born in the leap year. The leap year between 2005 and 2011 is 2008. Hence, Yasir was born in the year 2008. Hence, I follows.
As Yasir completes 4 years on February 29, 2102, it can be clearly understood that he was born in 2008. Hence, II follows. Hence, either I or II follows.


22) 1; Only I follows.


23) 5; None of the expression follows.

24) 2; P = N ≥ L > M. Hence, P > L is definitely true and L > P is definitely false.

25) 4; V>W≥X > Z. Hence, V > Z

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





నాన్నా చెప్పవా?

నీడలో ఉన్న వస్తువుకి నీడ ఎలా పడుతుంది?



ఏదైనా ఒక వస్తువుపైపడే కాంతి ఆ వస్తువుకు ఉండే భౌతిక స్వభావాన్ని అనుసరించి దాని ద్వారా చొచ్చుకొని పోవడం, వివిధ దిశల్లోకి పరావర్తనం చెందడం, లేదా ఆ వస్తువుచే శోషింప బడడం పీల్చివేయబడడం) జరుగుతుంది. ఆయా వస్తువుల స్వభావాన్ని బట్టి ఈ మూండిట్లో ఏదో ఒకటి జరగవచ్చు, లేదా ఈ మూడు ప్రక్రియలు వివిధ నిష్పత్తులలో చోటుచేసుకోవచ్చు. ఒక వస్తువు ద్వారా కాంతి ప్రయాణించలేనప్పుడు ఆ వస్తువు తాలూకు నీడ... ఆ వస్తువుపై కాంతి పడిన దిశకు రెండోవైపున పడుతుంది. అయితే సూర్యుడు లాంటి ఒక పెద్దశక్తివనరు నుంచి కాంతి వస్తున్నప్పుడు ఆ కాంతి తావరణంలోనూ, పరిసరాలలోని వివిధ భౌగోళిక స్వరూపాల వల్ల, కృత్రిమ కట్టడాలవల్ల అన్ని దిశలకూ చెదురుతుంది. ఇలా పరిసరాలలోని శిలలు, చెట్టు చేమలు తదితరాల వల్ల చెదిరిన కాంతి 'నీడలో ఉన్న వస్తువు'పై పడినప్పుడు, ఆ వస్తువు కూడా మొదటి వస్తువులాగా కాంతిని తన గుండాపోనివ్వనిది అయినప్పుడు... అప్పటికే నీడలోఉన్న వస్తువుకి కూడా మరో నీడ ఏర్పడుతుంది. అయితే మొదటి వస్తువునీడలాగా ఈ నీడ సాంద్రంగా ఉండక, ఉండీ లేనట్లుగా కనిపిస్తుంది. ఉదాహరణకు మేఘం తాలూకునీడలో ఉండే ఓ పెద్ద బండరాయి పైన,దూరంగా ఉన్న మరో శిలపైన పడిన సూర్యకాంతి పరావర్తనం చెంది పడడం వల్ల, ఆ బండరాయి నీడలో ఉన్నప్పటికీ దానికి మరోనీడ ఏర్పడుతుంది.

మీకు తెలుసా?

పాలపుంత మొదలు నుంచి చివరకు కాంతివేగంతో ప్రయాణించినా లక్ష యేళ్ల పడుతుంది




అమెరికాలో సెలవుల్లో విశ్రాంతి తీసుకోవడాన్ని నామోషీగా భావిస్తారు



స్మార్ట్‌ఫోన్ ఉన్నవాళ్లు ఫేస్‌బుక్‌ను రోజులో సగటున 14సార్లు చూస్తారని సర్వేల్లో తేలింది




రంగులు వేయండి




దారి కనుక్కోండి

కింద ఉన్న కూరగాయ తన స్నేహితుల గుంపు నుంచి తప్పిపోయింది. పాపం! అది తన స్నేహితుల దగ్గరకు వెళ్లడానికి సహాయం చేస్తారా?



కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



ఆచంటేశ్వరుడి గర్భగుడికి మరమ్మతులు

17 వరకూ మూసివేత



ఆచంటేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆచంట : ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం ఆచంటలోని ఆచంటేశ్వరస్వామి గర్భాలయాన్ని బుధవారం నుంచి తాత్కాలికంగా మూసివేశారు. వచ్చేనెల 17న తెరుస్తారు. గర్భాలయంలో స్వామి వారి స్వయంభూలింగం చుట్టూ టైల్స్ తొలగించి వాటి స్థానంలో గ్రానైట్‌ను అతికించే పనులు చేపట్టారు. విశాఖకు చెందిన భక్తుడు చిలుకూరి జగదీష్ రాయిని వితరణగా అందించారు. ద్రాక్షారామం భీమేశ్వరస్వామి ఆలయ బ్రహ్మ దేవులపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపి పనులు ప్రారంభించారు. ఆలయంలోని ఉపాలయం మార్తాండేశ్వరాలయంలో ఆచంటేశ్వరుడికి అభిషేకాలు జరుపుతామని అర్చకులు సన్నిధిరాజు వీరభద్ర కొండయ్య, శంకరమంచి ఉమామహేశ్వరరావు తెలిపారు. భక్తుల దర్శనార్థం స్వామి ఉత్సవ విగ్రహాన్ని పార్వతీదేవి అమ్మవారి ఆలయంలో ఉంచి పూజలు జరుపుతామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గొడవర్తి భగవాన్, ఈఓ దండు వెంకటకృష్ణంరాజు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లేటి పెద్దింటమ్మ హుండీ ఆదాయం రూ.9.57 లక్షలు

ఆకివీడు : కొల్లేటి కోటలో కొలువైన పెద్దింటి అమ్మవారి ఆలయంలోని హుండీని బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో గ్రామస్తులు, పోలీసుల సమక్షంలో 92 రోజుల హుండీని లెక్కించగా రూ.9.57 లక్షలు ఆదాయం లభించిందని కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలిపారు.


బొమ్మలతో బోధన



ఆల్ఫా బిట్ చిత్రం



నెలలు సరి చేయు చార్ట్



స్థాన విలువల చట్రం

శ్రవణం కంటే దృశ్యం మనసులో బాగా నాటుకుంటుందని మానసిక శాస్త్రవేత్తలు చెబుతుంటారు. అందుకే పాఠశాలల్లో పిల్లలకు ఎక్కువగా దృశ్యరూపంలోనే పాఠ్యాంశాలు బోధించాలని వారు సూచిస్తున్నారు. బొమ్మలను చూపిస్తూ పాఠ్యాంశాలు బోధిస్తే చిన్నారులు గమ్మత్తైన అనుభూతికి లోనవుతుంటారు. ఇలాంటి తరహా బోధనే అనేక మంది ఉపాధ్యాయులు అనుసరిస్తున్నారు. పిల్లలకు బడిపై ఇష్టం కలిగేలా, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఆకర్షణీయమైన బోధన చేయడంపై పలువురు ఉపాధ్యాయులు దృష్టి సారిస్తున్నారు. పెదవేగి దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో బొమ్మలతోనే బోధన సాగిస్తున్నారు. ఉపాధ్యాయులే సొంతంగా బోధనోపకరణాలను రూపొందించి వాటిని చూపిస్తూ పాఠ్యాంశాలు బోధిస్తుండటంతో విద్యార్థులు ఉత్సాహంగా బడికి తరలివస్తున్నారు. ఇదే తీరు విద్యాబోధన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అనుసరిస్తే పిల్లలు ప్రైవేటు వైపు దృష్టి సారించే అవకాశం ఉండదు.

– పెదవేగి రూరల్



టీచర్లు రూపొందించిన చార్టులతో విద్యార్థులు



పూసలతో జాతీయ పక్షి నెమలి

జాతీయ పోటీలకు నాగ హర్షిత



నాగహర్షితతో హెచ్‌ఎం, పీఈటీ

నిడమర్రు : చిననింద్రకొలను హైస్కూల్‌లో నైన్త్ విద్యార్థిని యు.రామనాగహర్షిత బేస్‌బాల్ రాష్ట్ర జట్టులో స్థానం పొందినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం జి.హరికృష్ణ తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ కడప జిల్లా జమ్మలమడుగులో జరిగిన అంతర్ జిల్లాల బేస్‌బాల్ పోటీల్లో హర్షిత ప్రతిభ కనపరిచి రాష్ట్ర జట్టులో చోటు సంపాదించిందన్నారు. వచ్చే నెల జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరపున హర్షిత ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. పీఈటీ ఎం.పద్మావతి ని, విద్యార్థి హర్షితను సర్పంచ్ ఎం.మణి, ఎంఈఓ వంగపండు నర్సింహమూర్తి అభినందించారు.

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు

పాలకొల్లు టౌన్ :

రాష్ట్రస్థాయి మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు ఆటనైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులు గెలుపొందారు. విజేతలకు ఎమ్మెల్సీ అంగర రామమోహన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ కోచ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత గంగుల ప్రసాద్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీవీ సోమరాజు, అక్కిరాజు, క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకూరి బుద్ధావతారం రాజు, జి.గాంధీభగవాన్ రాజు తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు..

రాష్ట్రస్థాయి ఉమెన్ సింగిల్స్‌లో విజేత ఎ.అక్షిత , రన్నర్‌గా ఆర్ ఎస్ హాసిని నిలిచారు. మెన్స్ సింగిల్స్‌లో కె.జగదీష్ విన్నర్ గా, కె.సాయి చరణ్ రన్నర్‌గా నిలిచారు. ఉమెన్ డబుల్స్‌లో కె.ప్రీతి, ఎం.అర్చన విజేతలుగా, ఎ.అక్షిత, సుధా కల్యాణి రన్నర్స్‌గా నిలిచారు. మెన్స్ డబుల్స్‌లో కె.జగదీష్, ఎస్.గౌష్ విజేతలుగా, బి.కిరణ్‌కుమార్, కె.వెంకటేష్ రన్నర్స్‌గా నిలిచారు.

ఘనపతింభజే !



ఆదిదేవుడు గణపతి పూజకు వేళయింది. హిందూ సంప్రదాయంలో తొలి పెద్ద పండగ గణపతి నవరాత్రులే.. ఇవి శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో అందరూ గణపతింభజే అంటూ గణనాథుని ఘనంగా కొలిచేందుకు సిద్ధమవుతున్నారు. ప్రతిమల కొనుగోలు, పూజాసామగ్రి సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో సంప్రదాయాన్ని ప్రతిబింబించే కథనం..

- » ఏకదంతాయ.. ఆరోగ్య ప్రదాయ..
- » మట్టి ప్రతిమా.. పర్యావరణ హితమా..
- » పూజా పత్రి.. మన వైద్య సంపత్తి
- » గణపతి పూజల్లో నిగూఢ సత్యాలు
- » ఆధునికత పేరుతో సంప్రదాయం అంతం



పూళ్లలో విగ్రహాలను తీర్చిదిద్దుతున్న మహిళలు

ఏలూరు (మెట్రో) :

గణపతి నవరాత్రులు సంప్రదాయం ఈనాటిది కాదు. తరతరాలుగా వస్తోంది. ఈ పండగ నిర్వహణ, పూజాసామగ్రి వాడకం వెనుక ఎన్నెన్నో మనకు తెలీని సత్యాలు దాగున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనం మన సంప్రదాయాన్ని మర్చిపోయాం. పండగ రూపురేఖలను మార్చేశాం. మట్టి ప్రతిమలకు బదులు రంగురంగుల బొమ్మలను పూజిస్తున్నాం. ఇది పర్యావరణానికి హానికరమని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ఇది మన సంప్రదాయం కాదని పండితులూ ఘోషిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పులేదు. అలాగే విఘ్నేశ్వరుని పూజించే పత్రిల్లోనూ ఆరోగ్య సూత్రాలు దాగున్నాయి.



ఐక్యతకు చిహ్నం

ఇప్పుడు ఊరూవాడా ఏకమై గణపతి నవరాత్రులను ఘనంగా జరుపుకుంటున్నాం. అయితే పూర్వం ఇలా సామూహికంగా జరిగేవి కావు. ఎవరికి వారు ఇళ్లవద్దే పూజలు జరుపుకునేవారు. అయితే 1893లో జాతీయ కాంగ్రెస్ నేత బాలగంగాధర్ తిలక్ ప్రజల్లో ఐక్యతను పెంచి స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడిపేందుకు గణపతి నవరాత్రుల వేడుకలను నిర్వహించడం ప్రారంభించారు. అప్పటి నుంచి సామూహికంగా వేడుకలు జరపడం మొదలైంది. అదే ఐక్యతకు చిహ్నమైంది. అందుకే ఇప్పుడు చిన్నచిన్న గ్రామాల్లోనూ గణపతి నవరాత్రులంటే ప్రజలంతా ఒక్కటైపోతారు. అంగరంగవైభవంగా వేడుకలు నిర్వహిస్తారు.

పూజాసామగ్రిలో ఆరోగ్య రహస్యం

వినాయక చవితి వర్షాకాలంలో వస్తుంది. ఈ కాలంలో వ్యాధికారక క్రిముల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా ప్రజలు వ్యాధులకు గురవుతారు. దీనిని గ్రహించిన పూర్వీకులు చవితి పూజల్లో పత్రి వాడకాన్ని ప్రారంభించారు. అనేక రకాల ఔషధ గుణాలున్న ఆకులతో పూజలు చేస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారని యోచించారు. 21 రకాల ఆకులతో పూజ చేయాలని నిబంధనపెట్టారు. వీటినే మనం పత్రిగా పిలుస్తున్నాం.

'మట్టి'మేలు తలపెడదాం

భీమడోలు : మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. మట్టిమేలు తలపెడదాం.. అంటూ పర్యావరణవేత్తలు నినదిస్తున్నారు. పాఠశాలలు, విద్యాసంస్థల విద్యార్థులూ ప్రచార బాట పట్టారు. కళాకారులూ మట్టి ప్రతిమలను తయారు చేసి హానికరం కాని రంగులు అద్దుతున్నారు. దీనిలో మహిళా కళాకారులూ భాగస్వాములు అవుతున్నారు. భీమడోలు మండలం పూళ్ల, పోలసానిపల్లిలో మట్టి విగ్రహాల తయారీ ఎక్కువగా జరుగుతోంది.

చాలా సంతోషంగా ఉంది



మా నాన్న పేరవపు నాగేశ్వరరావు 50 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. చిన్నతనం నుంచి మా తండ్రి నేర్పిన ఈ వృత్తిని వదలలేదు. వివాహమైంది. అయినా పండుగ వేళల్లో మా నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ విగ్రహాల రూపకల్పనలో సహకరిస్తున్నాను. మట్టి విగ్రహాల తయారీ సంతోషంగా ఉంది.

– లంకా భారతి, కళాకారిణి, పోలసానిపల్లి

పూజా పత్రం.. ఆరోగ్య హితం..



ఓం సముఖాయ నమః మాచీపత్రం పూజయామి

1 

మాచీ పత్రం : తెలుగులో దీనిని మాచ పత్రి అంటారు. చామంతి జాతికి చెందిన ఈ ఆకులు సువాసన వెదజల్లుతాయి. ఇవి దద్దుర్లు, తలనొప్పి, వాత నొప్పులు, కంటి, చర్మ సంబంధ వ్యాధులను తగ్గిస్తాయి.

ఓం గణాధిపాయ నమః బృహతీ పత్రం పూజయామి

2 

బృహతీ పత్రం : దీనిని ములక, వాకుడాకు అంటారు. ఇవి వంగ ఆకుల మాదిరి, తెల్లని చారలుండే గుండ్రని పండ్లతో ఉంటాయి. ఇది దగ్గు, జలుబు, జ్వరం, అజీర్ణం, మూత్ర, నేత్ర వ్యాధులను నయం చేస్తుంది. దంత ధావనానికి కూడా ఉపయోగిస్తారు.

ఓం ఉమాపుత్రాయ నమః బిల్వ పత్రం పూజయామి

3 

బిల్వ పత్రం : బిల్వ పత్రం అంటే మారేడు ఆకు. మూడు ఆకులుగా, ఒక ఆకుగా కూడా లభ్యమవుతాయి. ఇవి శివుడికి ఇష్టమైనవి. మహాలక్ష్మికి కూడా ఇష్టమైనవని చెబుతారు. ఇది జిగట విరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్ర వ్యాధులు, శరీర దుర్గంధాన్ని తగ్గిస్తుంది.

ఓం గజాననాయ నమః దూర్వాయుగ్మం పూజయామి

4 

దూర్వా యుగ్మం : దూర్వా యుగ్మం అంటే గరిక. ఇందులో తెల్ల గరిక, నల్ల గరిక అనే రకాలున్నాయి. ఇది వినాయకుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది. చర్మ వ్యాధులు, దద్దుర్లు, మూత్రంలో మంట, ముక్కు, ఉదర సంబంధ వ్యాధులు, అర్శ మొలలను నివారిస్తుంది.

ఓం హరసూనవే నమః దత్తూర పత్రం పూజయామి

5 

దత్తూర పత్రం : దత్తూర అంటే ఉమ్మెత్త మొక్క. ఇది సెగగడ్డలు, స్తనవాపు, చర్మ, శ్వాసకోశ వ్యాధులు, పేను కొరుకుడు, నొప్పులు, రుతు వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది. ఇది విషం కాబట్టి జాగ్రత్తగా వాడుకోవాలి.

ఓం లంబోదరాయ నమః బదరీ పత్రం పూజయామి

6 

బదరీ పత్రం : బదరీ పత్రం అంటే రేగు ఆకు. ఇందులో రేగు, జిట్రేగు, గంగరేగు అనే మూడు రకాలున్నాయి. జీర్ణకోశ, రక్త సంబంధ వ్యాధులు, చిన్న పిల్లలకు వచ్చే వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.

ఓం గుహాగ్రజాయనమః అపామార్గ పత్రం పూజయామి

7 

అపామార్గ పత్రం : తెలుగులో ఉత్తరేణి అంటారు. గింజలు సన్నటి ముళ్లను కలిగి ఉంటాయి. ఇది దంత ధావనానికి, పిప్పి పన్ను, చెవిపోటు, రక్తం కారటం, అర్శమొలలు, ఆణెలు, గడ్డలు, అతి ఆకలి, జ్వరం, మూత్ర పిండాలలో రాళ్లను నివారించడానికి ఉపయోగపడుతుంది.

ఓం గజకర్ణాయనమః తులసీ పత్రం పూజయామి

8 

తులసీ పత్రం : హిందువులు దేవతార్చనలో వీటిని విధిగా వాడతారు. ఇది దగ్గు, జలుబు, జ్వరం, చెవిపోటు, పన్ను నొప్పి, తుమ్ములు, చుండ్రు, అతిసారం, గాయాలను తగ్గిస్తుంది. ముఖ సౌందర్యం, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

ఓం ఏకదంతాయ నమః చూత పత్రం పూజయామి

9 

చూత పత్రం : అంటే మామిడి ఆకు. ఈ ఆకులకు శుభకార్యాల్లో విశిష్ట స్థానం ఉంది. వీటిని వాడని హైందవ గృహాలు ఎక్కడా ఉండవు. ఇది రక్త విరేచనాలు, చర్మ వ్యాధులు, ఇంట్లోని క్రిమికీటకాల నివారణకు ఉపయోగపడుతుంది.

ఓం వికటాయ నమః కరవీర పత్రం పూజయామి

10 

కరవీర పత్రం : దీనినే గన్నేరు అంటారు. దీని పువ్వులు తెలుపు, పసుపు, ఎరుపు రంగుల్లో ఉంటాయి. ఈ పువ్వులకు పూజల్లో విశిష్ట స్థానం ఉంది. ఇది కణుతులు, తేలు కాట్లు, విషకీటకాల కాట్లు, దురద, కంటి సంబంధ, చర్మ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది.

ఓం భిన్నదంతాయ నమః విష్ణుక్రాంత పత్రం పూజయామి

11 

విష్ణుక్రాంత పత్రం : ఇది నీలం, తెలుపు పువ్వులుండే చిన్న మొక్క. నీలం రంగు పువ్వులుండే మొక్కను విష్ణు క్రాంత అని పిలుస్తారు. ఇది జ్వరం, కఫం, పడిశం, దగ్గు, ఉబ్బసం వంటి వ్యాధులను తగ్గించడానికి, జ్ఞాపక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడుతుంది.

ఓం వటవే నమః దాడిమీ పత్రం పూజయామి

12 

దాడిమీ పత్రం : దాడిమీ అంటే దానిమ్మ మొక్క. శక్తి స్వరూపిణి అంబకు దాడిమీ ఫల నైవేద్యం ఎంతో ఇష్టం. అతిసారం, విరేచనాలు, దగ్గు, కామెర్లు, అర్శమొలలు, ముక్కు నుంచి రక్తం కారటం, కండ్ల కలకలు, గొంతు నొప్పి, చర్మవ్యాధుల్ని తగ్గిస్తుంది.

ఓం సర్వేశ్వరాయ నమః దేవదారు పత్రం పూజయామి

13 

దేవదారు పత్రం : దేవతలకు అత్యంత ఇష్టమైన ఆకు దేవదారు. దీని మానుతో చెక్కే విగ్రహాలకు సహజత్వం ఉంటుంది. ఇది అజీర్తి, పొట్ట సంబంధ వ్యాధులు, చర్మవ్యాధులు, కంటి వ్యాధులను తగ్గిస్తుంది.

ఓం ఫాలచంద్రాయ నమః మరువక పత్రం పూజయామి

14 

మరువక పత్రం : వీటిని ధవనం, మరువం అంటారు. ఆకులు ఎండినా సువాసన వెదజల్లటం దీని ప్రత్యేకత. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. జుట్టు రాలటం, చర్మ వ్యాధులను తగ్గిస్తుంది.

ఓం హేరంభాయ నమః సింధువార పత్రం పూజయామి

15 

సింధువార పత్రం : వీటినే వావిలి అంటారు. ఇవి జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులు, గాయాలు, చెవిపోటు, చర్మ వ్యాధులు, మూర్ఛ వ్యాధి, ప్రసవం అనంతరం వచ్చే ఇబ్బందులను తగ్గిస్తాయి.

ఓం శూర్పకర్ణాయ నమః జాజీ పత్రం పూజయామి

16 

జాజి పత్రం : ఇది సన్న జాజిగా పిలవబడే మల్లి జాతి మొక్క. వీటి పువ్వుల నుంచి సుగంధ తైలం తీస్తారు. వాత నొప్పులు, జీర్ణాశయ వ్యాధులు, మలాశయ వ్యాధులు, నోటిపూత, దుర్వాసన, కామెర్లు, చర్మవ్యాధులను తగ్గిస్తుంది.

ఓం సురాగ్రజాయ నమః గండకీ పత్రం పూజయామి

17 

గండకీ పత్రం : దీనిని లతా దూర్వా, దేవకాంచనం అంటారు. మూర్ఛ, కఫం, పొట్ట సంబంధ వ్యాధులు, నులి పురుగులను నివారిస్తుంది. దీని ఆకులను ఆహారంగా కూడా వినియోగిస్తారు.

ఓం ఇభవక్త్రాయ నమః శమీ పత్రం పూజయామి

18 

శమీ పత్రం : జమ్మి చెట్టు ఆకులనే శమీ పత్రాలంటారు. ఇది కఫం, మూలవ్యాధి, కుష్టు వ్యాధి, అతిసారం, దంత వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడుతుంది.

ఓం వినాయకాయ నమః అశ్వత్థ పత్రం పూజయామి

19 

అశ్వత్థ పత్రం : రావి ఆకులను అశ్వత్థ పత్రాలంటారు. ఇవి మల బద్ధకం, కామెర్లు, వాంతులు, మూత్ర వ్యాధులు, జ్వరాలు, నోటిపూత, చర్మ వ్యాధులను నివారిస్తాయి. జీర్ణశక్తిని, జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయి.

ఓం సురసేవితాయ నమః అర్జున పత్రం పూజయామి

20 

అర్జున పత్రం : తెల్ల మద్ది చెట్టు ఆకులను అర్జున పత్రాలంటారు. ఇవి మర్రి ఆకులను పోలి ఉంటాయి. ఇది అడవులలో పెరిగే పెద్ద వృక్షం. చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, మలాశయ దోషాలు, గుండె జబ్బుల నివారణకు బాగా పనిచేస్తుంది.

ఓం కపిలాయనమః అర్కపత్రం పూజయామి


21 

అర్క పత్రం : జిల్లేడు ఆకులను అర్క పత్రాలంటారు. శివుడికి ప్రీతిపాత్రమైనవి. ఇవి చర్మ వ్యాధులు, సెగగడ్డలు, కీళ్ల నొప్పులు, చెవిపోటు, కోరింత దగ్గు, దంతశూరి, విరేచనాలు, తిమ్మిర్లు, బోదకాలు, వ్రణాలను తగ్గిస్తాయి.



సుస్వాగతం.. నవరాగమా..


విట్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



డ్యాన్సులతో అదరగొడుతున్న విద్యార్థులు



భీమవరం : సుస్వాగతం.. నవరాగమా.. వెల్‌కమ్.. వెల్‌కమ్.. అంటూ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకల్లో సందడి చేశారు. పట్టణంలోని విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల (విట్) విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం జరిగాయి. పాటలు, డ్యాన్సులతో విద్యార్థులు సందడి చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కృషి పట్టుదలతో విద్యాభ్యాసం చేస్తే ఉద్యోగాలు సాధించడం కష్టమేమి కాదన్నారు. తోటి విద్యార్థులతో సఖ్యతగా వ్యవహరిస్తూ తమకు తెలియని విషయాలను ఇతర విద్యార్థుల ద్వారా నేర్చుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. చదువుతో పాటు గేట్, సివిల్స్, జీఆర్ఈ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రసాద రాజు, ఏజీఎం రమేష్‌రాజు పాల్గొన్నారు.


వక్రతుండాయా.. బహురూపాయ..!

వక్రతుండాయా.. బహురూపాయా..! అంటూ విద్యార్థులు గణపతిని భక్తితో కొలిచారు. వినూత్నంగా గణనాథుని రూపాలను ఆవిష్కరించారు. పసుపు, పిండి, కూరగాయలు, పేపర్, పసుపుతో విఘ్నేశుని ప్రతిరూపాన్ని ప్రతిబింబించి సృజనకు పదును పెట్టారు. ఉల్లంపర్రు మాంటిస్సోరి పాఠశాలలో బుధవారం ఈ ప్రతిమలను ప్రదర్శించి భళా అనిపించారు.

– పాలకొల్లు అర్బన్

